
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబాజీ కీ జై!
గురుకృప
జన్మదిన సంచిక
కరుణించే సాయి - మాకై ప్రభవించెనోయి...

# ప్రేమ, ఆనందం



**గురుబంధువు :** ప్రేమ గురించి, ఆనందం గురించి మీరు చాలా ప్రముఖంగా చెప్తారు. వాస్తవానికి ఈ రెండింటి మధ్య సంబంధం ఏమిటి? ఆనందం ప్రేమకు బిడ్డలాంటిదా లేదా ఆనందం ప్రేమకు ఆహారమా? ఆనందం ఏ విధంగా జనిస్తుంది?

**గురువుగారు :** ఆనందం ప్రేమకు బిడ్డ. మనం దేనినైనా ప్రేమించి, అది మనకు లభించినపుడు ఆ ప్రేమ మూలంగా మనకు సంతోషం, ఆనందం వస్తుంది. ఆ ప్రేమ లేకపోతే ఆనందం రాదు. మనం దేనినైనా ప్రేమిస్తే చాలా కష్టమైన పరిస్థితిలో కూడా మనకు ఆనందం కలుగుతుంది. (ఉత్తర కాశీ నుండి గంగోత్రికి వెళ్ళి తిరిగి వచ్చిన విషయాన్ని గురువుగారు ప్రస్తావిస్తూ) రోజంతా ప్రయాణం చేసి, అంత ఎత్తుకు వెళ్ళి తిరిగి వచ్చి, స్నానం చేసి, కడుపునిండా భోజనం చేసిన తర్వాత ఇలా ఇంత రాత్రిపూట సత్సంగంలో కూర్చోవడంలో ఏమి ఆనందం ఉంది? ఇది హింస కాదా?

**గురుబంధువులు ఒకేసారి :** లేదు, గురువుగారూ,

**గురువుగారు :** ఎందుకు, ఎందుకంటే సత్సంగమంటే మీకు ఇష్టం. అందుకే మీకు అందులో ఆనందం ఉంది. కాబట్టి మీకు ఆనందం కలిగించేది మీ ప్రేమ. కాబట్టి దీనర్థమేమిటంటే ఆనందానికి ప్రేమ తల్లి వంటిది. సత్సంగం రెస్టారెంట్ లాంటిది. నేను మీకు మెనూని అందించాను. మీకు నచ్చినవాటిని మీరు ఎంచుకోండి.

**గురుబంధువు :** నేను ఓ సత్సంగంలో మీరు చెప్పిన మాటలను ఉదహరించాలనుకుంటున్నాను. కానీ మీరు ఆ సత్సంగంలో ఉపయోగించిన అవే పదాలు నాకు గుర్తురావడం లేదు.

**గురువుగారు :** అంతకుముందు జరిగిన సత్సంగాలకు వెళ్ళి నేను చెప్పిన వాటిని ఉదహరించకండి. సత్సంగం విషయంలో కూడా మనం పాతదనం లేకుండా అప్పటికప్పుడు క్రొత్తగా ఉండాలి. మీరు, నేను తిరిగి మళ్ళీ వెనుకకు వెళ్ళాలనుకుంటారు. అది నేను చేయలేను. సత్సంగంలో విలువైనది ఏమిటంటే అందులోని సారాంశం. మీరు ఆకలితో ఉన్నారు. క్రితంసారి నేను మీకు చపాతీ ఇచ్చాను. ఇప్పుడు నేను మీకు పూరి లేదా ఇడ్లీ ఇస్తాను. లేదు, లేదు, లేదు క్రితంసారి నేను ఆకలితో ఉంటే మీరు చపాతీ ఇచ్చారు, ఇప్పుడేమో మీరు నాకు ఇడ్లీ ఇస్తున్నారు! అంటున్నారు. నేను చెప్పేది ఏమిటంటే మీ ఆకలి తీరిందా లేదా అని చూడండి. అంతే. పోయినసారి ఇచ్చిన చపాతీల గురించి మాట్లాడవద్దు.

– శ్రీబాబూజీ

సంపుటి : 24
సంచిక : 1

జనవరి 1
2021



గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో



పథగామి 4
– గురుకృప

అతడూ – ఆయనా 8
– శ్రీమోపిదేవి కృష్ణస్వామి

స్వేచ్ఛ 14
– శ్రీబాబూజీ

16 మనకేం కావాలి?
– 'శరచ్చంద్రికలు'

22 సద్గురు సమ్మోహనం
– జగన్మోహన్ రెడ్డి

26 నైవేద్యం
– శ్రీబాబూజీ

29 గురుకృపాలహరి
– గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## చేతల చేతనత్వం – సద్గురు చరితం

"జీవితాన్ని ఆధ్యాత్మికమైనది, అధ్యాత్మికము కానిది అని విభజిస్తావు? ఎందుకు ఈ కృత్రిమమైన విభజన చేసి ఒక దానికి ఎక్కువ, మరో దానికి తక్కువ విలువనిస్తావు? జీవితం జీవితమే. అందుకని మనదైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను ఒక భాగం చేసుకోవడమన్న ప్రశ్నే లేదు. సాధన అనేది మన జీవితంలో భాగం కావడంగాక మన జీవితమంతా మన సాధనలో భాగం కావాలి. ప్రతిరోజూ ఓ గంట ధ్యానం – అని మనం దానికి కేటాయించిన ప్రత్యేకమైన సమయంలోనే కాకుండా రోజుకు 24 గంటలు ఆధ్యాత్మిక సాధన సంభవమవ్వాలి. మనకు నేర్చుకోవాలనే దృక్పథమే ఉంటే నిత్యజీవితంలోని ప్రతి సందర్భాన్నీ సాధనగా చూడగలం, ఉపయోగించుకోగలం. అది ప్రపంచాన్నంతా గురువులాగా భావించడం, జీవితాన్నంతా గురువుగా చూడడం, ప్రతి విషయం నుంచీ, ప్రతి వ్యక్తి నుంచీ నేర్చుకోవడం" అంటారు శ్రీబాబూజీ. మన జీవనవిధానాన్ని సంస్కరించుకుంటూ జీవితాన్ని నిత్య నూతనంగా, ఆనందజీవన సోపానంగా మలచుకునేందుకు ఆధ్యాత్మికత ఉపయోగపడాలి. కేవలం భౌతికంగా దర్శనమిచ్చే క్రియలు, పూజావిధులు మనలను సంస్కరించగలవా? చేసే ప్రతీపనిలోనూ ఆ సుళువులను సాధించడం సాధ్యమేనా? అలా జీవించే క్రమానికి ఎలా పదునుపెట్టుకోగలం? గురుదేవులన్నట్లు "మనం చేసే పారాయణలు, నమస్కారాలు వల్ల బాబాకు ఒరిగేదేమిటి?" జీవితంలో చేసే ప్రతీ పనిని అర్థం చేసుకుని, అర్థవంతంగా మలచుకుని, మసలుకుంటే గురువు చూపే బాటలోని ప్రతి క్రియ వెనుక ఒక బోధ, శిక్షణ, ప్రేరణ, మార్గం, రహస్యం ద్యోతకమవుతాయి. గురువు చేతలు (పనులు) రాబోయే తరాలకు మాటలై, పూలబాటలైనాయి. మీలో మార్పు – జీవితంలో నేర్పు – ఇదీ నా కూర్పు అన్నది సద్గురుపథం.

మనకు తెలిసినంతవరకు చేతనత్వం (ఆధ్యాత్మికంగా జీవించడం) అంటే భౌతికమైన ఒక ప్రక్రియ. ధూపదీపాలను వెలిగించుకోవడం, నైవేద్యం సమర్పించుకోవడం, పూజగా భావించడం వంటి వన్నమాట. గురుదేవులు ఆశించేది మన జీవన విధానాన్ని మార్చుకోవడం, జీవించే నేర్పును తెలుసుకోవడం, పరిస్థితులకు అనుగుణంగా మారిపోని ఓర్పును కలిగి ఉండడం, తుదకు ఆనందజీవనం సాయిపథమని అవగతమై, ఆ అనంత సాయిచరణాలను చేరడం. వారి భావాలెంత సుస్పష్టమంటే "మీ మార్పు మీకవసరం లేకపోయినా నాకవసరం" అనేంత. "అనుగ్రహం ఎప్పుడూ ఉండేదే. మనం ఉపయోగించుకోవడంలోనే ఉంది. మనం పురోభివృద్ధి చెందడం లేదంటే, అనుగ్రహం



లేదని అర్థంకాదు. మనం ఉపయోగించుకోవడం లేదని అర్థం." అంటారు శ్రీబాబూజీ.

ప్రార్థన, మానసపూజ, పారాయణ, సత్సంగం, భజన, స్మరణ ఇలా అన్నీ మనం మన ప్రేమకు వ్యక్తీకరణలుగా మలచుకుంటూ వాటి అర్థాలను, అంతరార్థాలను గ్రహించుకుని, వేసే అడుగులను సరిదిద్దుకుంటూ ముందుకుసాగే పయనం–ఆనందజీవనయానం– అదే సాయిపథం. సాధనను 'సాయి'ని పూజించే గదికే పరిమితం చేసుకుంటే సాధ్యమయ్యేనా ఆనంద జీవనయానం? ఆలోచిద్దాం. 'సాధన' జీవితంలో భాగమైతే ఎలాగో, జీవితమే సాధనైతే ఎలా సాగేనో చూద్దాం.

**లీలావతి పరిణతి–ప్రగతి :**

రాక్షసులలో అగ్రగణ్యుడు హిరణ్యకశిపుడు. వారి భార్య లీలావతి గొప్ప పతివ్రత.పూజా, పునస్కారాల వెల్లువ హిరణ్యకశిపుని ఈశ్వరభక్తి. వరములాశించిన వేళ గొప్ప తపోసంపన్నుడు హిరణ్యకశిపుడు. లీలావతి గొప్పసాధ్వి. జీవితమే సాధన. ఆమెకు పతియే వ్రతము – భగవంతుని నిత్య సాన్నిధ్యమే ఆమె మనోగతము. మహాగొప్ప విష్ణుద్వేషి హిరణ్యకశిపుడు. కోరిన వరాలన్నీ ఇచ్చి పంపేదాకా ఈశ్వరుని కోసం తపస్సు చేయాలని అడవికి పయనమయిన భర్త సాయంత్రానికి తిరిగివచ్చేశాడు. ఏం జరిగిందని వెలవెలబోయిన లీలావతి భర్తను ఊరడించి శిరోభారాన్ని తగ్గించే నిమిత్తం ఒడిలో భర్త తలనుంచుకుని కుశలమడిగింది. "చెట్టుకిందకూర్చొని తపస్సు చేయ స్థిమిత పడేవేళ, "ఓం నమఃశివాయ" అని ధ్యానం చేసే సమయానికి ఒక చిలుక అదే చెట్టుపై వాలి నారాయణ, నారాయణ అంటూ ఒకటే రొద. అంతటితో నా ఏకాగ్రత చెదిరి, ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలమై మరోసారి ప్రయత్నిద్దామని వచ్చేసాను" అన్నాడు హిరణ్యకశిపుడు. జీవితమే సాధనగా కల్గిన లీలావతికి వచ్చిన చిలుక నారదమహర్షి అని అంతలోనే అర్థమయ్యింది. అయితే నమ్మనట్టుగా మొహంపెట్టి చిలుక పలుకలేమీ! నారాయణ స్మరణయేమి అంటూనే భర్తతో నేర్పుగా శిరోభారం తగ్గిస్తున్నట్లు గోముగా 108సార్లు నారాయణ నామం పలికించింది. చూలాలైన లీలావతి, తన కడుపులోని ప్రహ్లాదునికి అదే నామాన్ని దీక్షగా తండ్రిచే పలికించింది, అందించింది. బిడ్డ హరిపదం పట్టాడు – భర్త హరిపాదం చేరాడు. వచ్చిన చిలుక నారదుడన్న తలపు కలిగిందంటే ఆమె జీవితమే సాధనగా, భక్తే సాధనంగా మారడంతోనే కదా సాధ్యమయ్యింది. జీవితంలో ఆ ఒడుపు (పట్టు) సాధించడం ఆవశ్యకం. భగవంతుని 'లీల' వెనుక దాగి ఉన్న బోధను అవగతం చేసుకుంది 'లీలా'వతి. ప్రతిగా సాటిలేని యశస్సు తనకే కాక తన కుటుంబానికి లభించేలా చేసింది. **"మౌళికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నడూ మారవు"**



అంటారు శ్రీబాబూజీ. ఎవరైతే జీవనవిధానాన్ని మార్చుకున్నారో వారికి భగవత్కృప అందుతూనే ఉంది. బాబా చరిత్రలోనూ ఇట్టి గొప్ప జీవన విధానాలను మనం దర్శించవచ్చు.

శ్రీసాయిచరిత్రలో హరి సీతారాం దీక్షిత్ జీవిత గమనం గమనించుకుంటే జీవితమే సాధనగా ఎలా గడపాలో చక్కగా దర్శనమిస్తుంది. తన అపారమేధతో పేరెన్నికగన్న న్యాయవాద వృత్తి, దేశపౌరుల మన్ననలు, బ్రిటీషు వారిచే గౌరవము వెరసి ఒక ప్రాంతానికి కమీషనర్ అవ్వగలిగే సామర్థ్యము. దేహానికి వచ్చిన కుంటితనాన్ని గురించి ఆలోచన వదిలి మనసులోని కుంటితనాన్ని తొలగించుకున్న భక్త శిరోమణి. బాబా బొంబాయి వెళ్ళి తిరిగి తన వృత్తిని చేపట్టమన్నా సాయిపాదాలు పట్టుకుని జీవించాడు. తొమ్మిది మాసాల ఏకాంత జీవితం, తనదే అయిన వాడాలోనికి తన భార్యను కూడా అనుమతించని బాబా నియమనిబంధన. సంపాదించిన ట్రంకుపెట్టెల ధనం ఖాళీ అయిపోతున్నా చెదరని వైనం. బాబా మాటంటే వారికి పెట్టనికోట. ఎదురయ్యే సంఘటనలలో మనం చూసేది దీక్షిత్ కష్టం–వారికి మాత్రం శ్రీసాయి ఏది చేసినా సరే అదే ఇష్టం. చివరకు రైలుబండి అందించింది సాయే అని తలుస్తూ సాయిప్రేమ వాహనమెక్కి సాయిచరణాలలో ఐక్యమయ్యాడు. ఏది పొందినా, తనకేది చెందినా అది సాయిప్రసాదమే. శ్రీసాయి వారి జీవితంలో భాగం కాదు – శ్రీసాయే వారి జీవితం.

మనకు గమనింపులోనికి రాకుండానే మనకు ఆధ్యాత్మికత ఒక ప్రదర్శనగా మారిందేమో గమనిద్దాం. ఎందుకంటే ముడిచమురుగా భూమి నుండి వెలికి తీసిన పదార్థము నల్లగా, మురికిగా, చిక్కగా ఉంటుంది. శుద్ధి చేసిన కొద్దీ రకరకాల రూపాలుగా, బొగ్గుగా, పెట్రోలుగా, డీజిల్‌గా, కిరోసిన్‌గా మారుతూ అతి సాధారణమైన వస్తువు కూడా నాణ్యమైన వస్తువుగా మారుతూ విలువను పొందుతోంది. ముడిఇనుముగా ఉన్నప్పుడు ఒక ధర, రాడ్లుగా ఒక ధర, తీగగా మారితే ఎక్కువ ధర, స్ప్రింగ్‌గా తయారయితే ఎంతో ధర – ఇలా మారుతోంది. మన వ్యక్తిత్వం, మన ప్రవర్తన, మన ఆచరణ, మన అవగాహన ఇలా జీవితంలోని ప్రతీ అంశము ఆధ్యాత్మికతతో నిండిన వేళ ఎంతో నాణ్యంగా రూపొంది మరింత స్ఫూర్తితో తులతూగాలి కదా! ఏం జరుగుతుందో – ముడి ఇనుముగానే ఉండిపోయామా? స్ప్రింగ్‌లా మారగలిగామా? ఎవరికి వారే విశ్లేషించుకోవాలి మరి. మాటల్లో వర్ణించలేని మానవతావాది, శ్రీరామకృష్ణుల దివ్యత్వానికి మానవరూపం స్వామిరంగనాధానంద ఇలా అంటారు "ఆధ్యాత్మికంగా నువ్వు ఎదుగుతున్నావనుకుంటున్నావా? అయితే నువ్వు సాటివారిని ప్రేమించగల్గుతున్నావా? నీ



అంతరంగంలో శాంతిని అనుభవిస్తూ నీ చుట్టూ ఆ శాంతి అనుభవమయ్యేట్లు చేయగలుగుతున్నావా? ధ్యానంతో అంతరంగంలో ఉద్దీపన చెంది, సేవాభావంతో చేసే పనిలో బాహ్యంగా శాంతి వ్యక్తమవుతుంటే దానిని ఆధ్యాత్మికంగా ఎదగడమనవచ్చు".

**గురుచరితమే క్రాంతి–గురుచరణమే శాంతి :**

గుక్కెడు మంచినీళ్ళు త్రాగుతుంటే బాబా, పుస్తకం పట్టుకుంటే బాబా, ఆహారం స్వీకరిస్తే బాబా, ప్రయాణం చేస్తుంటే బాబా, లేచి కూర్చుంటే బాబా, పడుకునే వేళ బాబా, పదం పలికితే బాబా, పథం పడితే బాబా, ఈ క్షణం, ఆ క్షణం, అనుక్షణమూ బాబానే. సాధనా ప్రస్థానంలోని కష్టంలోనూ బాబానే. మధురాతి మధురమైన జీవనంలోని ప్రతీ ఇష్టంలోనూ బాబానే. జీవితంలో బాబా భాగం కాదు – జీవితమే బాబా. కడలుడిపి నీరాడని జీవితాలలో, కోర్కెల ప్రాధాన్యపు వెల్లువలో నీవు తప్ప పరంబెరుగ అన్నట్లు ఉంటుంది మన ప్రవర్తన. కోర్కెలకు శరణాగతి చెంది – వారికి శరణాగతి చెందినట్లు భావించే మనకు గురుచంద్రుల జీవితం చుక్కానిగా మారాలి.

"అమ్మా, ఆకలిగా ఉంది" అని బాబా అంటే, ఆతురతతో, ప్రేమతో తెచ్చిన రొట్టె, కూరలను కుక్కకు పెట్టగా అదేమిటి బాబా మీ కోసం ప్రేమతో తెస్తే, ఇలా కుక్కకు పెట్టారు అన్న లక్ష్మీభాయి షిండేతో బాబా అంటారు "రోజూ ఇలానే చేస్తుండు" అని. బాబా చెప్పిన మాటకు అర్థంగా రోజూ ఒక కుక్కను వెతికి రొట్టె, కూర పెట్టటమనే తంతుగా మారితే మనలో మార్పు కలిగేనా? ఆకలిగొన్న జీవి కోసం ఎంతయితే ప్రేమ, ఆతురతలతో ఆనాడు భోజనం పెట్టిందో ఆ "ప్రేమ"ను కలిగి, ప్రతీరోజు ఆ పనిని మనస్ఫూర్తిగా చేయమని సాయి తమ అభీష్టాన్ని తెలిపారని అవగతం చేసుకుంటే ఆనంద జీవనానికి అది ఒక సోపానమవుతుంది. శ్రీబాబూజీ జీవితం శ్రీసాయి చూపిన ఆ శుభ్రమార్గంగానే దర్శనమయింది. పరాయణత్వంతో చేసే పారాయణగా, 'తాను' అన్న భావనకు ఆస్కారం లేని నమస్కారంగా, వ్యక్తిత్వపు పరిమితులను దాటించే భజనగా, మానసాన్ని శుద్ధి చేసి శ్రీసాయినాధునికి వేసే ఆసనమయిన మానసపూజగా, అహపుఛాయలు లేని సాయి ప్రేమాచరణలుగా – వారి ప్రతీచర్య, ప్రతీమాట, ప్రతీబాట సాయిపథానికి స్పష్టతను, పరిపూర్ణతను చేకూర్చింది.

జీవితమనే ఇంటిని ప్రతీరోజు శుభ్రం చేసుకుంటున్నాం. ఎలాగంటే ఆ రోజుకు నివసించేలా, స్వచ్ఛంగా ఉండేలా! పండుగలప్పుడు ఇల్లంతా 'శుభ్రం' చేసుకుంటాం కదా! నిరుపయోగమైన వస్తువులను చెత్తబుట్టలో పడేస్తాం కదా! 'శుద్ధత' కావాల్సింది కేవలం పండుగరోజేనా! సద్గురువనే సజీవ దర్పణ సహాయంతో 'మన'ల్ని మనం ఎప్పటికప్పుడు 'శుభ్రం' చేసుకుంటే కడకు 'శుద్ధత'



పొందడం ఎంత సులభమో ఆలోచిద్దాం. నిత్యస్వచ్ఛత, నిత్యశుభ్రతగా మారితే మనిషిలో శుద్ధత సాధ్యమే కదా! తాత్యాసాహెబ్ నూల్కర్ మొదట షరతులతోనే సాయివద్దకు చేరాడు. అనంతమైన షరతులు లేని ప్రేమకృపా వర్షపు జల్లులతో శుద్ధమై విఠలుని ఆరతులకు సంబంధించిన ఒక్క తీర్పుతో ఇక న్యాయమూర్తి హోదా చాలునని అర్థమయ్యింది. సాయి సాన్నిధ్యపు సాధన–జీవితంలో భాగంగా మొదలై వారి జీవితమే సాయిసాన్నిధ్యమయ్యింది. మానవుడిచ్చింది నిలవదని – దైవమిచ్చింది పోదని అవగతమయ్యింది. చివరకు ఆ సద్గురు సామ్రాట్ చరణాలలో ఐక్యమయ్యింది. సద్గురు అనుగ్రహ వెలుగులలో స్వచ్ఛత, శుభ్రతలను నిత్యక్రమం చేసుకొని శుద్ధులమై సాయికృపను సదా స్వీకరించేందుకు సంసిద్ధులమై సాగుదాం. ప్రయత్నపు ఒక్క అడుగు మనది – మనలను సాఫల్య తీరాలను చేర్చే పది అడుగులు వారివి...

**సాయిభక్తులకు జయం... శరశ్చంద్రుని బిడ్డలకు విజయం.** **– గురుకృప**

## అతడూ - ఆయనా

అది విశాఖపట్నం డాబాగార్డెన్స్ ప్రాంతం. ఆ ప్రాంతంలో జంక్షన్‌కు దగ్గరగా ఒక ఇల్లు. ఆ ఇల్లు వర్మగారిది. మధ్యాహ్నం మూడు గంటలవేళ, మధ్యగదిలో మాస్టరుగారికి ఎదురుగా ఒక నడివయస్కుడు దీనవదనుడై కూర్చుని ఉన్నాడు. మాస్టరుగారు అతనివైపు చూస్తున్నారు. ఆ చూపులో కొంత మందలింపు, కొంత ఓదార్పు.

ఆ సన్నిధిలో కూడదీసుకోడానికి ప్రయత్నిస్తూనే ఆ దీనవదనుడు ఇలా అన్నాడు “అదేమిటో చిత్రం అది ఒక వైభవం. జీవితం ఒక వెలుగు వెలిగింది. ఇంతలోనే అది ఎందుకు మాయమయింది” అదే నాకు అంతుపట్టడం లేదు. ఉన్నట్టుండి ఈ చేతులద్వారా దివ్యశక్తి ప్రసరించింది. నా చేతులతో తాకిన ప్రతివారికీ వ్యాధులన్నీ సమూలంగా నిష్క్రమించాయి. లోకంలోనికి ఈ విచిత్రం పాకింది. ఇక చీమలబారుల్లా జనం ఎక్కడకు వెళితే అక్కడే. పత్రికలు బ్రహ్మరథం పట్టాయి. జనం బారులు మరింతగా పెరిగాయి. తాకితే చాలు మా జన్మ ధన్యమౌతుందన్నట్లుగా చూసేవాళ్ళు వాళ్ళు. నాలో వెలుగు, నా నిండా వెలుగు, నా నుండి వెలుగు ప్రసరించేది. వ్యాధులు పరుగెత్తేవి. లేనివాళ్ళూ వచ్చారు. ఉన్నవాళ్ళూ వచ్చారు. జమిందారులు వచ్చారు, రాజులు వచ్చారు, రాణులూ వచ్చారు, చాలా వ్యాధులున్నవాళ్ళు వచ్చారు, ఎందరో వచ్చారు.

నాలో నాకు శివుడు కనిపించాడు. నీవు నా అవతారమన్నాడు. అందుకే ఈ మహిమ అన్నాడు. నేను శివుడు అవతారాన్నని రూఢీ అయ్యింది. వ్యాధులతో పాటు మరీ దగ్గరయినవారి భవిష్యత్తు



కూడా చెప్పడం మొదలుపెట్టాను. వాళ్ళు ఏమేమో అడిగేవారు. అవతార పురుషుడికి ఏదైతే మాత్రం ఏమిటి? లెక్క చేసేవాడిని కాదు. ఒక రోజున నాకు ఒకటి తోచింది. కొద్దికాలంలో ఫలానారోజున ఈ సృష్టికి ప్రళయం వస్తుందని. మళ్ళీ మళ్ళీ తోచసాగింది. నేను శివుడి అవతారాన్ని అయినపుడు, లయం నా కర్తవ్యమైనపుడు అది ఫలానా అప్పుడు జరుగబోతున్నదని నాకు తోచడంలో ఆశ్చర్యం ఏముంది? అనిపించింది.

కానీ... కానీ... ఈ వైపరీత్యమేమిటి? ఎందుకని ఆ వెలుగు కనిపించడం మానేసింది; ఎందుకని నా మనస్సుకు విషాదం కమ్ముకున్నది? ఎందుకని నేను దారుణాతి దారుణమైన దౌర్బల్యస్థితిని అనుభవిస్తున్నాను? ఎందుకని నేను ముట్టుకుంటే వ్యాధులు తగ్గడం లేదు? నాకు అంతా అగమ్యగోచరంగా ఉంది? అక్కడికీ జపం చేసాను. ధ్యానం చేసాను. ఆ వెలుగును ప్రసన్నం చేసుకోవాలని చూసాను. నా నుండి ప్రసరించమని వేడుకున్నాను. అయినా ప్రసరించదేం? వ్యాధులు తగ్గవేం?

దారులు చెదరిపోయినాయి. నేను బోర్లా పడిపోయాను. ఒకప్పుడు నేనెక్కడున్నానో అని వెతుక్కుంటూ వచ్చేవారు జనం. ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నానో ఎవ్వరికీ అక్కరలేదనుకుంటాను. ఎందుకని ఇలా జరిగింది? ఎందుకని నేను ఇలా అయిపోయాను? ఎందుకని నా నుండి ఆ వెలుగు ప్రసరించడం లేదు? దయచేసి మీరు నాకు వివరించి చెప్పాలి. నాకు మనశ్శాంతి కావాలి. అది మీరివ్వాలి, అతని కళ్ళ నుండి అశ్రువులు రాలుతున్నాయి. వాటిని తుడుచుకునే ప్రయత్నం చేస్తున్నాడతను. అతనిలోనికి చూస్తూ మాస్టరుగారు ఇలా అన్నారు "మీ స్థితి నాకు అర్థమైంది. దానికదిగా జరుగుతున్న దానిని అలా జరగనిస్తేనే బాగుండేది. మధ్యలో మీరు అడ్డుపడ్డారు. అది ఆగిపోయింది". "నేనా, అడ్డుపడింది నేనా" అన్నట్లు చూసాడు అతను. "అవును, అక్షరాలా మీరే" అన్నట్లుగా తలపంకిస్తూ మాస్టరుగారు ఇంకా ఇలా అన్నారు. ప్రసరిస్తున్న వెలుగును వెలుగుగా చూడక ఇది నాదీ అని మీకనిపించింది. దానికి శరణాగతి చెందవలసిన మీరు దానిని మీ సొత్తుగా భావించారు. అంతేకాక నేను అవతారమూర్తిని అన్న భావం మీలో కలిగింది. **నేనూ దైవమే అనడంలో తప్పులేదు. నేనే దైవము అంటే తప్పు. నేనూ దైవమే అని గ్రహించినపుడు మనిషి మహనీయుడు అవుతున్నాడు. నేనే దైవము అని అహంకరించినపుడు మనిషి రాక్షసుడవుతున్నాడు.** మన పురాణాలలోని రాక్షసుల కథలన్నీ ఏమిటి? వాళ్ళేమీ తక్కువవాళ్ళు కారు. తపస్సంపన్నులే, వెలుగును చూసినవారే. కానీ ఆ వెలుగును సొంతం చేసుకుందామనుకున్నారు వాళ్ళు. తామే దైవమని అహంకరించారు వాళ్ళు. అక్కడే పడిపోయారు. మీరు కూడా.



**నిజంగా మనకు దైవదర్శనం లభించింది అనడానికి సంకేతం ఏమిటో తెలుసునా? ఆ స్థితిలో దైవం కానిదంటూ ఇంకేమీ కనబడదు. తానూ దైవమే. తన చుట్టూ ఉన్నదీ ఆ దైవమే. తనయందు, నిఖిల భూతముల యందు వ్యక్తం అవుతూ ఉన్నది ఆ దైవమే, అని స్పష్టంగా తెలుస్తుంది.** మనయొక్క వ్యక్తిత్వం కరిగిపోయి అస్తిత్వం మాత్రం ఉంటుంది. తనను తాను వేరుగా గుర్తించుకునే జబ్బు అక్కడ ఉండదు. కరిగిపోవలసిన వ్యక్తిత్వం పెరిగిపోయింది అంటే అర్థం ఏమిటి? ఎంతగా పెరిగిపోయింది అంటే ఆ వెలుగు ప్రసరించడానికి కూడా సందు దొరకనంతగా! అంతగా అడ్డుపడి, ప్రసరించకుండా, చూసుకొని, ఎందుకని ఇలా జరుగుతుంది అంటే ఎలా?

దైవం నీ నుండి ఒకటి సంకల్పించింది. దానినలానే సాగనిస్తే బావుండేది. ఇదేదో ఎవరికీ లేనిది మనకే ఉన్నదని గర్వించావు. వ్యాధి బాధలను చూడమని ఆ దైవం చెబుతుంటే అది మాని రాణుల వ్యక్తిగత వ్యవహారాలలో తలమునకలుగా మునిగిపోయావు నీవు. వాళ్ళ కోర్టుకేసుల బాధ్యతలను కూడా నీవే పడ్డావు. కోర్టులకుగాను సాక్షుల తయారీ కూడా నీ వంతే అయింది. **తానెందుకు దిగివస్తోందో అందుకుగాను వినియోగించబడినట్లైతే ఆ వెలుగు నిన్ను విడిచిపెట్టి ఉండేది కాదు.** దానికి నిమిత్తమాత్రంగా నిలబడవలసిన నీవు దాని పేరిట అహంకరించి కానిదారులు తొక్కావు. ఇప్పుడు విచారించి ఏమి లాభం? కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. అతడు పశ్చాత్తాపం చెందుతున్నట్లుగా కనిపించాడు. మాష్టరుగారి చూపులు కూడా అతడికేదో ఉపదేశాన్నిస్తున్నట్లుగానే ఉన్నాయి. వెలుగునుండి వెలువడేవన్నీ వెలుగునే వర్షిస్తాయి కదా!

అందుకనే ఆ పెద్దల చూపు, స్పర్శ, వారి మాట, మొదలైనవన్నీ చేరువైన వారిని ఉద్ధరించడానికే వ్యక్తమవుతూ ఉంటాయని అనుభవజ్ఞులు చెబుతూ ఉంటారు. అతడు ప్రస్తుతం ఆ చూపులతో తడపమంటున్నాడు. కనుకనే అహంకార స్థితి నుండి పశ్చాత్తాపం వైపుకు అతడు మళ్ళుతున్నాడనిపించింది. దీనమైన గొంతుతో అతడితో అన్నాడు "నేను కావాలని కోరుకుంటున్నారు కదా! జపధ్యానాదులతో ప్రయత్నిస్తున్నాను కదా! మరి వెనుకటి వారి ఆ వెలుగు నా నుండి మళ్ళీ ప్రసరిస్తుందంటారా? సూటిగా చూస్తూ మాస్టరుగారిలా అన్నారు "నీవు ఏ ప్రయత్నం చేశావని మొదట అది నీ నుండి వెలువడింది. అలాంటిదానికి ఇపుడు ప్రయత్నం చేయవలసిన స్థితిలో పడ్డావు నీవు. చిత్రంగా లేదూ! ప్రయత్నిస్తున్నాను కదా! మళ్ళీ వస్తుందా అని అడుగుతున్నావు రావచ్చును. రాకపోవచ్చు. ప్రయత్నం మంచిదే. కాని ప్రతి ప్రయత్నాన్నీ అది వరించాలని లేదు. **అది అనుగ్రహం. ప్రయత్నాలన్నింటికీ అతీతమైనదది. అది దిగి రాదల్చుకుంటే నీ ప్రయత్నాన్నీ**



**స్వీకరిస్తుంది తప్ప నీవు ప్రయత్నించినపుడల్లా అది దిగి రావాలని లేదు.** ప్రయత్నం మంచిదే. కొనసాగనీ". తలపైకెత్తి మాస్టరుగారివైపు చూస్తున్నాడాయన. క్రమంగా ఆ చూపులో ఒక విధమైన ఆశ్చర్యం గోచరించసాగింది. అలా చూస్తూనే ఉన్నాడు. అలా చూస్తూనే ఇలా అన్నాడు "మాస్టరుగారూ! మీ నుండి ఇంత వైభవం వ్యక్తమవుతుంది కదా! మీ దగ్గరకు ఇంతమంది ఆకర్షితులవుతున్నారే, కొన్ని వందల కుటుంబాలకు మీరొక ఇలవేల్పుగా గోచరిస్తున్నారు కదా! దేశ విదేశాలలో మీరింత కార్యక్రమాన్ని నడిపిస్తున్నారే? దీనికంతటికిగాను మీరెలాంటి సాధన చేస్తుంటారు? రహస్యమైతే చెప్పవద్దు, చెప్పవచ్చును అంటేనే చెప్పండి".

చిరునవ్వు నవ్వుతూ మాస్టరుగారు ఇలా అన్నారు **"ఇందులో రహస్యం ఏముంది? ఈ జీవితం ఒక తెరచిన పుస్తకం. అధ్యయనం చేసేటందుకు ఇక్కడ ప్రతి ఒక్కరికీ వీలుంది. ఇక సాధన అంటావా? నా దృష్టిలో ఈ జీవితమే ఒక సాధన. ఈ దేహం ఆ సాధనకు ఒక సాధనం.** అంటే ఏమిటి అన్నట్లుగా చూసాడు అతను మరింతగా ఆశ్చర్యపడుతూ. ఆ ఆశ్చర్యాన్ని గమనించిన మాస్టరుగారు తాను చెప్పిన దానిని ఇలా వివరించారు ఉదయమూ, సాయంత్రమూ అందరితో కలసి నేనూ ప్రార్థన చేసుకుంటాను. ఉదయం ప్రేయర్ తరువాత షోడశోపచార పూజ జరుగుతుంది. అదీ అందరితో కలసి చేసేదే. **ఈ ప్రేయరు, పూజ, దినచర్యను దివ్యంగా నడిపేటందుకుగాను కావలసిన నేపథ్యాన్ని రూపొందిస్తాయి. ఆపైన దినచర్య అంతా ఒక అఖండమైన దైవదర్శనంగా కొనసాగిపోతూ ఉంటుంది.**

ప్రేమగా చూస్తూ మాస్టరుగారు ఇలా కొనసాగించారు. **"విగ్రహారాధన సజీవ విగ్రహారాధనకు కావలసిన పాత్రతను మనకు అందించడానికే ఉన్నది.** అందుకనే ప్రేయరు, పూజ తగిన నేపథ్యాన్ని రూపొందిస్తున్నాయని నేను చెప్పడం జరిగింది. ఇక ఆపైన నడుస్తున్న ప్రతి సన్నివేశం దైవ విలాసమే. చేరవస్తున్న ప్రతి మనిషీ దైవస్వరూపమే. పెద్దలు **"జగమే రామమయం"** అన్న మాటకు అర్థమిదే! **అలా మన జీవితం రామమయం, ప్రేమమయం కావాలి. నేను చేస్తున్న సాధన అదే. చేస్తున్నాను అనడం కన్నా అది నా నుండి జరుగుతూ ఉన్నది".**

మీరు చెప్పింది బాగుంది. మరి ఆచరణలోనికి వచ్చేసరికి మంచి వాళ్ళుంటారు, చెడ్డ వాళ్ళుంటారు. అందరినీ దేవుడిగా చూడటమంటే ఎలా సాధ్యమవుతుంది? అని అడిగాడతను. అతని చూపులు ఉత్సుకతలను ప్రకటిస్తున్నాయి. ఉల్లాసంగా చూస్తూ మాస్టరుగారు ఇలా అన్నారు మంచి ప్రశ్న వేశావు. ఈ సాధనకు మంచి చెడులు అడ్డురావు. దైవాన్ని దర్శిస్తూనే ఎవరికి తగినట్లుగా వారితో ప్రవర్తించాలి. దేవుడి విగ్రహాన్ని చింతపండు, బూడిద వేసి తోమడానికి మనం జంకడం



లేదు కదా! ఆ తోముతున్న క్షణాల్లో కూడా అది దేవుడి విగ్రహమన్న స్పృహ మననుండి జారిపోవడం లేదు కదా! అది జారిపోకుండానే విగ్రహం బాగుండాలని మరింతగా అదిమిపెట్టి మరీ తోముతున్నాం కదా! లోకం యెడల మన ప్రవర్తన సరిగా అలాగే ఉండాలి. **మంచికి తగినట్లు మంచితో, చెడుకి తగినట్లు చెడుతో మనం ప్రవర్తిస్తూనే అఖండమైన దైవదర్శనాన్ని దినచర్య నుండి అనుభవించవచ్చు.** ఇలా అనుభవించడం చేతనైన కొద్దీ మన దినచర్య యొక్క పన్నా పెరుగుతుంది. సృష్టి ప్రణాళికతో దానికి శ్రుతి కుదురుతుంది. ఈ సృష్టి కార్యక్రమమే మన జీవితకార్యంగా రూపొందుతుంది. ఆ రూపొందిన క్షణాలలోని దివ్యానుభూతిని రుచి చూడటానికే మనం ఈ దేహాలను స్వీకరించి దిగివచ్చేది.

బోధపడుతున్నట్లుగా చూస్తూనే అతడిలా అన్నాడు లోకాన్ని దైవస్వరూపంగా చూడాలి అన్నారు మీరు. మరి మనమూ దైవస్వరూపమేనని పెద్దలు చెబుతున్నారు కదా! మరి... అన్వయం ఎట్లా కుదురుతుంది? చూపులతో వెలుగులను వెదజల్లుతూ మాస్టరుగారు ఇలా అన్నారు "మామూలు స్థితిలో అనుకోడానికి మాత్రమే పనికొస్తుంది నీవన్నది. నేను వివరించిన సాధన మనలో జరిగినపుడు మాత్రమే నీవన్న మాటకు నిజమైన అన్వయం కుదురుతుంది. ఎలానో తెలుసునా? **లోకాన్ని దైవంగా దర్శించడం మొదలుపెట్టాలని చెప్పాను. ఆ దర్శనం కొనసాగుతున్నపుడు ఆ అనుభూతి తనదాకా కొనసాగి అంటే అతని మనస్సు హృదయాన కరిగి తానూ ఆ దైవంలోని భాగమేనన్న నిజం మానవుడికి అనుభవంలోనికొస్తుంది. అపుడు లోకమంతా తనమయము. ఇక నడిచేది తన్మయత్వమే.**

అలాంటి తన్మయస్థితిలో జీవితం తైలధార వంటి అఖండ అనుభూతిగా యజ్ఞార్థంగా సాగిపోవాలని శ్రీకృష్ణుని నుండి భగవద్రామానుజుల వరకు పెద్దలందరూ చేసిన బోధ. 'నేనే' దైవము అని అనుకొన్నపుడు అది అహంకారం, 'నేనూ' దైవమే అన్న స్థితి అనుభవానికొచ్చినపుడు అది ఆత్మదర్శనం. **అనుకునేస్థితి నుండి అనుభవించే స్థితికి ఎలా ప్రయాణం చేయాలన్నదే ఇంతవరకూ నేను చెప్పింది.**
**"మిమ్మల్ని చూస్తుంటే చిత్రంగా ఉంది. ఇంత సూటిగా ఎలా చెప్పగలుగుతున్నారు మీరు"** అన్నాడతను అబ్బురపడుతూ. **"సూటిగా చూస్తున్నాను గనుక"** అన్నారు మాస్టరుగారు, అతనిని చూపులతో తడుపుతూ. "ఇంకొక్కమాట అడగనా" అన్నాడతను. "ఇన్ని అడిగినవాడికి ఆ సంకోచమెందుకు? అడుగు" అన్నారు మాస్టరుగారు. మీరు చెప్పిన సాధనా విధానానికి, సమన్వయానికి నా జోహార్లు. దానికిక తిరుగులేదు. ఇపుడు నేనడగబోతున్నది మీరింత పెద్ద వ్యవహారం పెట్టుకున్నారు కదా! లౌకికంగా, ఆర్థికంగా దీనినంతా ఎలా సంభాళిస్తున్నారని. దర్శనంతోపాటు ఎంత ఒడుపు ఉంటే ఈ కార్యక్రమం నడుస్తుంది? కుర్చీలో వెనక్కి వాలుతూ మాస్టరుగారు ఇలా అన్నారు "నేను చెప్పిన



సాధన సత్కర్మాచరణ రూపంగా సాగినపుడు వనరులకై వెతుకులాడవలసిన పని ఉండదు. వాటికవిగా నడిచివచ్చి మనను చేరుకుంటాయి. ఎవరైనా దీనిని అవలంబించి చూడవచ్చును. లోకానికి కావలసిన పని మన నుండి జరుగుతున్నపుడు మనకొరకుగాని మననుండి జరుగుతున్న కార్యక్రమం కొరకుగాని వనరులకై దేవులాడవలసిన పని ఉండదు. ఇది నా అనుభవం.

ఇదిగో దైవం ఈ సి.వి.వి.గారి రూపంలో నాకు సాక్షాత్కరించాడు. **నాకు కావలసినవన్నీ ఈ ఫొటో వెనుక నుండి వచ్చేస్తుంటాయి.** ఇది నా అనుభవం. వందలు అవసరమైన రోజున వందలు వస్తాయి. వేలు అవసరమైన రోజున వేలు వస్తాయి. అవసరానికి తగినట్లుగా అవి అమరుతూ ఉంటాయి. అవసరముంటేనే వస్తాయి. **అవి రాలేదూ అంటే అవసరం లేదని అర్థం. అవసరాన్ని బట్టి వస్తాయి.** మన కోరికను బట్టి మాత్రం రావు. **అసలు కోరికలు కరిగి పోయినవాళ్ళకే అవసరాలంటే ఏమిటో తెలుస్తాయి. చాలాసార్లు మనం కోరికలనే అవసరాలని అనుకుంటూ ఉంటాం. నేను చెప్పినట్లుగా సాధన సాగినపుడు కోరికలు కరిగిపోతాయి. అవసరాలు తీరిపోతాయి. నీకేది కావాలో నీవు గమనించేలోపలే అది నీ దగ్గరకు చేరుకుంటుంది. ఇది ఈ జీవితానుభవం. ఈ జీవిత సందేశం.** ఇంక చాలుననుకుంటాను నీకు కావలసింది నా నుండి లభించింది అనుకుంటాను. ఈ ప్రశాంతత క్రమంగా నిన్ను నిలబెట్టగలదు. ఆ ప్రశాంతతలో స్థిరపడు.

**త్వరపడటం కాదు స్థిరపడటం కావాలి. అప్పుడు నీకేం కావాలన్నది నీవు చెప్పవలసింది కాదు. అది దైవం నిర్ణయించవలసింది.** మళ్ళీ కలుసుకుందాం. నేను వెళ్ళిరానా మరి. అని అంటూ, అంటూనే లేచి నిలబడిన మాస్టరుగారి పాదాలపై అతడు అప్రయత్నంగా మోకరిల్లాడు. **ఆ పాదాన్ని తనకు కావలసిన పథం చూపవలసిందిగా, తనను నడపవలసిందిగా అర్థిస్తున్నట్లుగా ఉన్నది ఆ నమస్కారం. అనుభూతిభాష్పాలతో పాదాలను కడుగుతున్న అతన్ని చేతులతో పట్టిలేపి అక్కున చేర్చుకున్నారు మాస్టరుగారు. అతడు ఆయనలో అలా ఒదిగిపోయాడు. – శ్రీమోపిదేవి కృష్ణస్వామి**

గురువు ఉంటే వారి జీవితాల్లో యోగం – క్షేమం ఉంటాయి. 'యోగం' అంటే కావలసింది ఇవ్వడం. 'క్షేమం' అంటే ఇచ్చిన దానిని, ఉన్నదానిని కాపాడటం. అందుకే 'యోగక్షేమం వహామ్యహం' అని గీతావాక్యం. మనం ఉభయకుశలోపరి అంటూ, మీ యోగక్షేమాలు తెలుపగలరు అంటూ ఉత్తరాలు వ్రాస్తాం. దాని భావం ఇది. యోగం అంటే మనలో ఉన్న అన్నింటికీ మైత్రీభావం కలగడం. ఇదే మన బాహ్యజగత్తులో అందరి హితాన్ని కోరేంత మైత్రీభావం పెరగడమే సాంగత్య (సత్సంగ)ఫలం.

– సత్య సంకలనాలు



# స్వేచ్ఛ

**గురుబంధువు :** గురువుగారూ, పిల్లలకు బాబా మీద ప్రేమ కలగడానికి మనం ఏదైనా చెప్పాలా? లేక అది వాళ్ళకి సహజంగా వస్తుందా?

**గురువుగారు :** సహజంగా రావాలి. నూరిపోయ్యకండి.

**గురుబంధువు :** అంటే, కథల రూపంలో అలా చెప్పొచ్చంటారా గురువుగారు?

**గురువుగారు :** ఊ, చెప్పొచ్చు. అంతమాత్రం చేత వాళ్లని బలవంతం చెయ్యొద్దు. దానివలన వాళ్ళు పెరిగి పెద్దయిన తరువాత, వాళ్ళల్లో ఒక విధమైన విముఖత కలుగుతుంది. ఎప్పుడూ ఆ స్వేచ్ఛ అట్లాగే ఉండాలి. నేనందుకనే మన స్కూల్లో కూడా, సాయిబాబా స్కూల్ అయినప్పటికి కూడాను, పిల్లలకు బాబా తత్త్వాన్ని నూరిపోయటం మాత్రం నేను చెప్పలేదు. స్కూల్‌కు సంబంధించిన ప్రార్థనలో కూడా, బాబా పేరు రాకుండానే ప్రయత్నం చేశాను. వాళ్ళకు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచించటం రావాలి. అది వాళ్ళ ఎంపిక అవ్వాలి.

**గురుబంధువు :** సత్సంగం సమయంలో పిల్లలు గొడవచెయ్యకుండా ఉండాలంటే, వాళ్ళకు అలా చెప్పాలేమో కదా గురువుగారు?

**గురువుగారు :** విమానాశ్రయంలో గొడవచేస్తుంటే చెప్పవూ? రైలులో గొడవచేస్తుంటే చెప్పవూ? సినిమాహాలులో గొడవచేస్తుంటే చెప్పవూ? ఎవరింటికైనా వెళ్ళినప్పుడు గొడవచేస్తుంటే చెప్పవూ? అట్లాగే సత్సంగంలో కూడా గొడవ చెయ్యొద్దని చెప్తాం. గొడవ చెయ్యొద్దని చెప్పటం వేరే, బాబాకు దణ్ణంపెట్టుకో, దణ్ణం పెట్టుకోమని చెప్పటం వేరే. రెండింటికీ తేడా ఉంది.

**గురుబంధువు :** నమస్కారం చేసుకోమని ప్రోత్సహించవచ్చా?

**గురువుగారు :** అది కూడా ఏమీ చెయ్యక్కర్లేదు. మనం చేస్తుంటే పిల్లలు చేస్తారు. మనల్ని బట్టే పిల్లలుంటారు. చెప్పేదానికేముంది? చెప్తాం. మిగతావన్నీ ఎలా నేర్పిస్తున్నామో, ఇది కూడా అట్లాగే చెప్తాం. మనకు మంచిదనిపించింది వాళ్ళకు చెప్తాం. వాళ్ళు చెయ్యనంటే బలవంతం చెయ్యకండి. పిల్లలకు స్వేచ్ఛగా ఆలోచించడం అలవాటు చెయ్యండి. ఎందుకంటే, బాబా అయినా, ఆధ్యాత్మికత అయినా, ఏదైనా సరే, వాళ్ళకై వాళ్ళకు ఇష్టముండి చేసేది తప్పితే, మన బలవంతం మీద చెయ్యకూడదు. నూరిపొయ్యకూడదు. బ్రెయిన్ వాష్ చెయ్యకూడదు. బ్రెయిన్ వాష్ చేస్తే ఏమవుతుందనంటే అది వాళ్ళకు సాంప్రదాయం అవుతుంది. ఆచారం అవుతుంది. ఆచారంగా, సాంప్రదాయంగా వచ్చినటువంటి వాళ్ళ భక్తి కూడా సాంప్రదాయంగానే ఉంటుంది. మంచి సంప్రదాయమైన



కుటుంబంలో పుట్టినటువంటి వాళ్ళు, ఉదయాన్నే లేచి గాయత్రిమంత్రం జపించుకుంటూ, కాసేపు పునశ్చరణ చేసుకుంటూ, అట్లా ఉంటారంతే. అదే పద్ధతిలో ఉంటుంది. పద్ధతిగా ఉంటారు. కానీ, ఆ పద్ధతికి, ఈ పద్ధతికి తేడా ఉంది. ఇది లోపల మనస్సులో నుంచి రావాల్సింది. అది వాళ్ళ క్వెస్ట్ కావాలి. వాళ్ళ అన్వేషణ కావాలి. వాళ్ళ అన్వేషణలో, ఇది మార్గం అని తెలిస్తే ఇది తీసుకుంటారు, వేరేమార్గంలో ఉంటే వేరేమార్గం తీసుకుంటారు. ఆ స్వేచ్ఛను మనం వాళ్ళకివ్వాలి.

## ఎడ్యుకేషన్ (విద్య)

**గురుబంధువు :** గురువుగారూ, సాయిపథంలో పిల్లలు, చిన్నప్పటి నుంచే వాళ్ళు పెద్దయ్యాక ఏం కావాలనేది అంటే డాక్టర్ కావాలి, ఇంజనీర్ కావాలని అలా వాళ్ళకుంటుంది కదా? అలా వాళ్ళు ముందునుంచే అనుకోని చేయడం సరైనదేనా, లేదా ఏది అవకాశం వస్తే అది చేసుకుంటూ పోవాలా?


**గురువుగారు :** అలా అనుకోని చెయ్యటమే సరియైనది. పిల్లలు వాళ్ళకై వాళ్ళు అనుకోని చెయ్యటమే సరియైనది. మనం అనుకున్నట్లు వాళ్ళచేత చేయించటం కాదు. "మా అబ్బాయిని డాక్టర్ చెయ్యాలనుకున్నాము. అందుకని వాడిని రాచి రంపాన పెట్టైనా సరే డాక్టర్ని చెయ్యాలి" అని అనుకోకూడదు. అలా మాత్రం చెయ్యకూడదు. వాళ్ళ యొక్క అభిరుచులు ఎలా ఉంటాయో, ఆ అభిరుచులకు అనుగుణంగానే వాళ్ళు చదువుకోవటంలో తప్పు లేదు. అదే చెయ్యాలి. వాళ్ళకు దేనిమీదైనా ఆసక్తి ఉంటే దాని మీదనే వాళ్ళని ప్రోత్సహించాలి. అంతే తప్పితే, "నాకు దీని మీద ఆసక్తి, అది మంచిది కాదు, దానికి ఉద్యోగ అవకాశాలు లేవు" అని ఇలాంటి మాటలు చెప్పొద్దు. నిజంగా బాబా మీద ఆధారపడితే, ఎటువంటి చదువుకైనా ఉద్యోగావకాశాలు ఆయన చూపిస్తారు.

*(మిగతా తరువాయి సంచికలో)* *– శ్రీబాబూజీ*

**కష్టాలు ఎంతగా ముంచుకు వస్తున్నా, బరువు బాధ్యతలెంతగా పెరుగుతున్నా, ఆత్మీయుడు, సమర్థుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడైన వారు గురువు. వారు మనతో ఉన్నారన్న ఎరుక కలిగిన వానిని, బరువు బాధ్యతలు క్రుంగదీయలేవు, అవి వారి మనసును తాకవు. "అన్నింటికీ ఆయనున్నాడు" అన్న ఎరుక ఇన్నింటినీ తాకనివ్వదు. ఆ ఎరుక, ఆ స్పష్టత మనకు వారి స్పర్శను, వారి సాన్నిధ్యాన్ని ప్రసాదిస్తాయి. ఇది వారి నిజమైన ప్రసాదం. -గురుకృప**



## మనకేం కావాలి?



**భక్తుడు :** గురువుగారూ! అమెరికాలో కుటుంబంతో నివసించడం, అక్కడ నా ఉద్యోగ పరమైన బాధ్యతల వల్ల నేను మీతో ఉండే ఎన్నో అవకాశాలను కోల్పోతున్నట్లు అనిపిస్తుంది. ఇలా ఉంటే నేను నా ఆధ్యాత్మిక లక్ష్యాన్ని సాధించలేనేమో అని భయంగా ఉంది.

**గురువుగారు :** ఇరవైనాలుగు గంటలూ నాకు దగ్గరగా ఉండే వాళ్ళంతా గొప్పవాళ్ళని, దూరంగా ఉన్న మీరు ఏదో కోల్పోతున్నారనీ అనుకోవద్దు. మీరేమీ కోల్పోవడం లేదు. కోల్పోతే ఇక్కడుండేవాళ్ళే ఏదైనా కోల్పోతున్నారేమో, (గురువుగారు నవ్వుతూ...) బాబా మీ అవసరాలు తీరుస్తూనే ఉన్నారు కదా, సమయం వచ్చినప్పుడు ఈ అవసరం తీరే మార్గం కూడా బాబానే చూపిస్తారు. **"నా భక్తులను పతనం కానివ్వను"** అన్నారు బాబా. బాబా చెప్పిందే శాసనం. అది జరిగి తీరుతుంది! మనమంతా ఆయన భక్తులం, మనం భయపడవలసిన అవసరం లేదు. అర్హతానర్హతలంటూ ఏమీలేవు. నిజానికి చెప్పాలంటే మనమంతా యోగ్యత లేనివాళ్ళమే, బాబానే మనకు ఆ యోగ్యతనిస్తారు. మనమంతా కాగితపు ముక్కల్లాంటి వాళ్ళం, బాబా అనుగ్రహమనేది రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంతకం వంటిది. ఆ సంతకం ఈ కాగితాలను కరెన్సీ నోట్లుగా మారుస్తుంది. కానీ సమస్యేమిటంటే ఈ కాగితమంతా సిరా మరకలతో అలికేసి ఉంది. (నవ్వులు...) బాబా దాని మీద సంతకం చేసినప్పటికీ ఆ సంతకం మనకు కనిపించడం లేదు. ఆ కాగితాన్ని కాస్త తెల్లగా చేసుకుని, బాబా సంతకం పెట్టడానికి తగిన ఖాళీని సిద్ధం చేసుకోవడమే మనం ఇప్పుడు చేసేది.

చిన్న చిన్న విషయాలను కూడా తెగ పట్టించుకుంటూ, ఎప్పుడూ వాటి గురించే పదే పదే ఆలోచించే వాళ్ళను చూస్తే నాకు నిజంగా చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఆమె నాతో ఇలా మాట్లాడింది, ఈయన నాతో అలా ప్రవర్తించాడు, ఆమె నాకు హలో చెప్పలేదు. ఇతను నన్ను పట్టించుకోలేదు... ఇలాంటి విషయాలు. అయితే ఏంటట? నువ్వు అంతదూరం నుండి వచ్చింది ఫలానా ఫ్రెండుతో **'హలో'** చెప్పించుకోవడానికేనా? (గురువుగారు నవ్వుతూ...) మీ ఆలోచనలు ఎలా ఉన్నాయో ఒక్కసారి చూడండి! కనీసం మీరు నాతో కూర్చునే పది పదిహేను నిమిషాలు – మీరు మౌనంగా ఉండాలనుకుంటున్న ఈ కొద్ది సమయమైనా – మీరు నిజంగా మౌనంగా ఉంటున్నారా?

మనం ఇలా ఈ పరిస్థితిలో ఉండటానికి కారణం ఏమిటి? ఎందుకంటే మీరు మూడు విషయాలను



మర్చిపోతున్నారు. **ఎందుకు, ఏమిటి, ఎలా!** ఈ మూడు అంశాల సూత్రాన్ని మీరు గుర్తుపెట్టుకోండి, ఇంకేమీ అక్కరలేదు. మనం ఇక్కడ 'ఎందుకు'న్నాం? మనం చెయ్యాల్సిన పను'లేమిటి', చెయ్యకూడని పనులేంటి, మనం వాటిని 'ఎలా' చేస్తున్నాం? మనం సరిగా చేస్తున్నామా, లేదా అన్న విషయం మనకు వేరెవరో చెప్పనక్కరలేదు. ఇక్కడ పరీక్షలేమీ ఉండవు. మీరు సాధించిన ఫలితాలను సరిచూడటానికి వేరేవాళ్ళు ఎవ్వరూ ఉండరు. మీ గురించిన వాస్తవాన్ని మీకు తెలియజేయడానికి మీరు మీ రోజును ఎలా గడుపుతున్నారు అన్న ఒక్క విషయం చాలు. ఇక్కడ మిమ్మల్ని పరీక్షించుకునేది మీరే!

**గురువుగారు :** మనకేం కావాలి. మన గమ్యం ఏమిటి, మన జీవిత లక్ష్యం ఏమిటి అనే విషయాల పట్ల మనకు స్పష్టత ఉండాలి. తర్వాత ఒకవేళ ఎప్పుడైనా మన లక్ష్యం మారితే మార్చుకోవచ్చు కానీ ఇప్పుడు మనకు ఏం కావాలి అనే విషయంపట్లయినా స్పష్టమైన అవగాహన ఉండాలి. అప్పుడు మనం ఏమి చేసినా, మనం సాధించింది కొంత మాత్రమే అయినా మనకు ఆ సంతృప్తి, ఆనందం ఉంటాయి. లేకపోతే మనం చేసేదంతా తంతుగా (యాంత్రికంగా), అలవాటుగా మారుతుంది. ప్రపంచమంతా ఇలాగే నడుస్తోంది యాంత్రికంగా. ఒక వ్యక్తిని సాధకునిగా మార్చేది ఏమిటి? అతను గురువును పట్టుకుని ఉంటాడా లేక ఇరవై నాలుగు గంటలూ సాధన చేస్తాడా లేదా యోగం చేస్తాడా ఇవి కాదు. ఒక వ్యక్తి సాధకుడు అని చెప్పడానికి ఇవి గీటురాళ్ళుకాదు. **తన లక్ష్యం పట్ల స్పష్టత ఉన్నవాడే సాధకుడు.** మీరు, మాకు పరిపూర్ణమైన ఆనందం (fulfilment) కావాలి అంటున్నారు, అలా అయినప్పుడు మీకు ఆ పరిపూర్ణానందాన్ని ఇచ్చేది ఏమిటో అన్వేషించండి.

**భక్తుడు :** గురువుగారూ! మన లక్ష్యం ఏమిటి? మన మౌలికమైన అవసరం ఏమిటి అని తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు :** అది ప్రతి ఒక్కరూ ఎవరికి వారు అన్వేషించుకోవాలి. మీకు నిజంగా ఏమి కావాలి, దానిని మీరు పొందడానికి సహాయం చేసేది ఏమిటి అనే విషయాలను మీరే అన్వేషించుకుని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. దాని గురించి ఆలోచించండి మీకు తెలుస్తుంది. మీకు నిజంగా తెలుసుకోవాలనే అవసరం ఉంటే మీరు అన్వేషిస్తారు. మీరు నిజంగా (జబ్బుతో) బాధపడుతూ ఉంటే మీరే మంచి డాక్టరును వెతుక్కుంటూ వెళ్ళి, చికిత్స చేయించుకుంటారు. హోమియోపతి, ఆయుర్వేదం లేదా మరోదానినో ప్రయత్నిస్తారు. మీకు నిజంగా అంత బాధలేకపోతే మీరు డాక్టరు కోసం వెతకరు. మనకు నిజంగా ఏమి కావాలో మనకు తెలియకపోవచ్చు. కానీ దానిని తెలుసుకోవడమే



మన జీవిత లక్ష్యం. అదే మన అన్వేషణ, మన సాధన, మన కృషి యావత్తూ.

**భక్తుడు :** గురువుగారూ! నాలో ఉన్న అడ్డంకులు తొలగించుకుని బాబాకు దగ్గర కావడం ఎలా?

**గురువుగారు :** మీరు నిజంగా బాబాకు దగ్గర కావాలనుకుంటున్నారా? ఒకవేళ నిజంగా అలా అనుకుంటే, మీరు అలా దగ్గర కావడం కోసం ఏమి చేస్తున్నారో చూసుకోండి. మీ ఉద్దేశ్యంలో బాబాకు దగ్గర కావటం అంటే ఏమిటి? బాబా దగ్గర నుండి మీరు ఏమి ఆశిస్తున్నారు? బాబా సన్నిధిని మీరు ఎలా అనుభూతి చెందుతున్నారు? అందుకనే నేను, మీరు ప్రేమించే ఒక లక్ష్యాన్ని, ఒక స్పష్టమైన గమ్యాన్ని పెట్టుకుని మీరు వేసే అడుగులన్నీ దాని వైపుకే పడేలా ప్రయత్నించమని చెబుతాను. ఇలాంటి ప్రయత్నం మిమ్మల్ని ఆ లక్ష్యానికి చేరువ చేస్తుంది. లేకపోతే మీరు నిలకడలేకుండా ఉంటారు. అలాగని దీనర్థం నన్నుగానీ లేదా బాబానుగానీ మీ లక్ష్యంగా పెట్టుకోమని కాదు. మీరు ఏ లక్ష్యాన్నైనా ఎంపిక చేసుకోండి, కానీ దానికి కట్టుబడి ఉండండి. మీ ప్రేమకు కేంద్రంగా ఉన్న విషయాన్ని ఎంచుకోండి. తరువాత ఆ లక్ష్యానికి చేరువకావడం ఎలా అనే ప్రశ్న వస్తుంది. ఇలా కాకపోతే మీరు ఒక దిశలో నడుస్తున్నామని అనుకుంటూ నిజానికి మరో దిశలో వెళ్ళిపోతారు. మీకు నిజంగా ఏమి కావాలో అనే విషయంలో మీకు స్పష్టత లేదు. కాబట్టి మీకు ఇటువంటి అడ్డంకులు అనుభవమవుతున్నాయి. మీరు బాబాకు దగ్గర కావడాన్ని అనుభవంలోనికి తెచ్చుకోలేకపోతున్నారు.

**భక్తుడు :** గురువుగారూ! మమ్మల్ని రకరకాల అకర్షణలు, రకరకాల వైపులకు లాగడం వలన మాకు నిజంగా ఏమి కావాలనే విషయాన్ని తెలుసుకోవడం కష్టమవుతోంది.

**గురువుగారు :** మనిషి మనస్సు యొక్క సంక్లిష్టత ఇక్కడే ఉంది. మనకేం కావాలో తెలుసుకోవడం ఎందుకంత కష్టమవుతుందంటే, మనకు కావాల్సింది చాలా విషయాలతో ఇమిడి ఉంటుంది. మనం కొన్ని విషయాలను ఒక సిద్ధాంతపరంగా మాత్రమే కావాలని కోరుకుంటాము. వాటిని పొందడం మనకు మంచి చేస్తుందని భావిస్తాం. కానీ, మనం వాటిని నిజంగా కావాలనుకోము. ఉదాహరణకు : ముక్తి, మోక్షం... ఇలాంటి సిద్ధాంతాలు. వీటిని తలకెక్కించుకొని రోజుకు ఆరుగంటలపాటు ధ్యానంలో కూర్చుని ఆత్మవిచారణ చెయ్యాలనో, జపం చెయ్యాలనో, మరేదో చెయ్యాలనో అనుకుంటాం. అది మంచిదే. కానీ, మనం అలా కూర్చోగలుగుతున్నామా? మనం ఎంతో దూరం నుండి ఆత్మ విచారణ చేయడానికి తిరువణ్ణామలై వచ్చాం. మీకు మీరే లెక్కపెట్టుకోండి, ఎన్ని గంటలు – గంటలు



అంటే చాలా ఎక్కువేమో (నవ్వులు...) ఎన్ని నిమిషాలు మీరు ఆత్మవిచారణ చేస్తున్నారు?

అది మీకు అవసరంలేదని నేను చెప్పడంలేదు – అది మీకు కావాలి, కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే కావాలి. ఇది కాకుండా మీకు కావలసినవి ఇంకా వేరే ఉన్నాయి. మీకు నిజంగా ఆత్మవిచారణ అవసరమా? ముందు మీకు నిజంగా ఏమి కావాలో తెలుసుకోండి. అలా చేయడం వలన ఒకరకంగా మీ గురించి మీరు తెలుసుకోగలుగుతారు. అలా తెలుసుకున్నప్పుడు మీ వ్యక్తిత్వం గురించిన వాస్తవం మీకు అనుభవంలోనికి వస్తుంది. అది ఒక్కసారి మీకు అనుభవమయ్యాక, మీరు దానిని అంగీకరించాక మీరు అక్కడ నుండి మొదలుపెట్టవచ్చు.

మీ బుర్రలను వివిధ రకాల పదజాలంతో, సిద్ధాంతాలతో, ఊహలతో నింపుకోవద్దు. ముందు మీకు ఏం కావాలో తెలుసుకోండి, తరువాత దానిని సాధించే పద్ధతిని కనుక్కోండి. అది విశ్వసనీయమైన పద్ధతేనా? ఈ పద్ధతిలో ఇంతకుముందు ఎవరైనా ప్రయత్నించి విజయం సాధించారా? వాళ్ళు ఏదైతే పొందారో మీకూ నిజంగా అదే కావాలా? సాధనలో విశ్లేషణంటూ అవసరమైతే మనం చేసుకోవలసిన విశ్లేషణ ఇది. బ్రహ్మం మొదలైన సిద్ధాంతాల గురించి మాట్లాడుకోవడం విశ్లేషణ కాదు. అది కేవలం చర్చ మాత్రమే. మనకు ఏ మాత్రం అంతుబట్టని విషయాల గురించిన చర్చ. మీ అంతరంగాన్ని మీరు తరచి తరచి చూసుకోండి. అక్కడ ఆత్మ ఉందో, బ్రహ్మం ఉందో లేదో మరేదైనా ఉందో తెలుస్తుంది. మీకు అవసరమైనది ఏమిటో మీకు తెలుస్తుంది. మీకు ఏమి అవసరమో మీకు తెలిసి ఉంటే, మీ అంతట మీరే, సహజసిద్ధంగానే దానిని పొందే మార్గాన్ని తెలుసుకోగలుగుతారు. అది చాలా సహజంగా జరుగుతుంది.

**భక్తుడు :** గురువుగారూ! ఒకసారి గంగగిర్ మహరాజ్ బాబాను దర్శించుకోవడానికి మసీదుకు ఒక దగ్గర దారిలో వచ్చారని, అప్పుడు బాబా వారిని వారించి, “ఇలా దగ్గర దారిలో రావద్దు. సాధారణంగా వచ్చే ప్రధాన మార్గంలోనే రమ్మ”ని చెప్పారని చదివాను. గంగగిర్ మహరాజ్ బాబాను దర్శించుకోవాలనే ఆతృతతోనే కదా అలా దగ్గర దారిలో మసీదుకు వచ్చారు – అందులో తప్పేముంది? బాబా ఆయనను అలా చేయవద్దని ఎందుకన్నారు?

**గురువుగారు :** బాబా అక్కడ చెప్పింది మసీదుకు చేరుకునే దగ్గరదారి గురించి కాదు. బాబా, ఆధ్యాత్మికమార్గంలో చాలామంది ఎంచుకునే అడ్డదారుల (దగ్గర దారుల) గురించి చెప్పారు. సాధారణంగా ఆధ్యాత్మికమార్గాలలో, సంస్థలలో, “మన ఉద్దేశ్యాలు సరైనవి అయినప్పుడు, ఆశయాలు మంచివైనప్పుడు, మన లక్ష్యం ఉన్నతమైనది, కాబట్టి దానిని చేరుకోవడానికి ఎలాంటి మార్గమైనా



ఎంచుకోవచ్చు అనుకుంటారు. మనం మన వాళ్ళను బాగా ఉపయోగించుకుందాం, మనం ఎలాగైనా డబ్బులు ప్రోగేద్దాం, ఎలాగూ వాటిని బాబా గురించి పదిమందికీ తెలియజేయడానికే కదా వాడుతున్నాం” అనుకుంటారు. కొన్ని సంస్థలు తమ లక్ష్యాలు ఉన్నతమైనవి. కాబట్టి వాటిని సాధించడానికి తమకు నచ్చిన ఎటువంటి మార్గాన్నైనా ఎంచుకోవచ్చని తమను తాము నమ్మించుకుంటారు. వాళ్ళకు వాళ్ళ లక్ష్యమే ముఖ్యం, ఆ లక్ష్యానికి చేరుకునేందుకు వెళ్ళే మార్గం వారికి ముఖ్యం కాదు.

కానీ సమస్యేమిటంటే లక్ష్యం ఎప్పుడూ అస్పష్టంగానే ఉంటుంది. వారికి మంచి జరుగుతుందా లేదా, వారు ఆ డబ్బులను బాబా ప్రచారానికి సరిగా ఖర్చు చెయ్యగలుగుతారా అనే విషయం స్పష్టంగా వారికి తెలియదు. అది అస్పష్టం. మన చేతుల్లో ఉన్నది కేవలం మార్గం మాత్రమే. అది స్పష్టంగా ఉంటుంది. మనం లక్ష్యాన్ని త్వరగా చేరినా, చేరకపోయినా మనం మన మార్గం విషయంలో ఎప్పుడూ జాగ్రత్తగానే ఉండాలి. లక్ష్యం కన్నా మార్గమే ముఖ్యమైనది. మనకు ఉన్నతమైన లక్ష్యం ఉండాలి కానీ ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించడానికి సవ్యమైన, ఉన్నతమైన మార్గాన్ని త్యాగం చేయకూడదు. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని అపసవ్యమైన మార్గాలలో చేరుకోలేము. మన లక్ష్యం ఏదైనా సరే దానిని చేరుకోవడానికి మనం ఎంచుకునే మార్గం స్వచ్ఛంగా ఉండాలి. మనం మన లక్ష్యాన్ని చేరుకుంటామా లేదా అన్నది ముఖ్యంకాదు. మన మార్గం మంచిదైనపుడు లక్ష్యసాధనలో మనం ఎప్పుడూ సరైన దారిలోనే ఉంటాం. విషయం మనకు స్పష్టంగా అనుభవమైనా కాకపోయినా దానిని పట్టించుకోవలసిన అవసరం లేదు.

నిజానికి అక్కడ మనం ఒక చోటు నుండి మరో చోటుకు ప్రయాణం చేయడం లేదు. మనం ఎక్కడున్నామో అక్కడ వృత్తాకారంలో పరిభ్రమిస్తూ పరివర్తన చెందడం వంటిది. మనం ఉన్నతమైన మార్గాన్ని, స్వచ్ఛమైన మార్గాన్ని, నిజాయితీతో కూడిన మార్గాన్ని అంటిపెట్టుకోవడానికి ప్రయత్నించడం ద్వారా మన లక్ష్యం మనకు ప్రత్యక్షమయ్యేలా చేసుకోవడానికి ప్రతిక్షణం ప్రయత్నిస్తున్నాము. ఆ ప్రయత్నంలో మనం విజయం సాధించినప్పుడు మన మార్గమే గమ్యమవుతుంది. గమ్యమే మార్గమవుతుంది.

**గురువుగారు :** సాధారణంగా నా చుట్టూ జరిగే కార్యక్రమాల నిర్వహణా విషయాలలో నా జోక్యం ఉండదు. ఎవరైనా ఏదైనా సక్రమంగా జరగడంలేదనే విషయాన్ని నా వద్దకు తీసుకువస్తే తప్ప నేను కలుగజేసుకోను. ఎవరైన అవసవ్యమైన పద్ధతులలో చేస్తున్నారని తెలిస్తే మాత్రం ఆ కార్యక్రమాన్ని



లేదా ఆ పనిని పూర్తిగా నిలిపి వేసిన విషయాలు కూడా చాలామందికి తెలుసు. నేను ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆ నిర్ణయాలు సాధారణంగా ఎవ్వరికీ నచ్చవు.

నేను ఎక్కువగా మహాత్మాగాంధీ ఆచరించిన పద్ధతులు గురించి చెబుతుంటాను. 1921వ సం॥లో సహాయ నిరాకరణోద్యమం విజయవంతంగా జరుగుతోంది. సహాయనిరాకరణోద్యమం అహింసాయుతంగా జరగాలని గాంధీ పిలుపునిచ్చారు. ఎట్టి పరిస్థితులలోనూ హింసకు తావు ఉండకూడదన్నారు. సువిశాల భారతదేశంలో ప్రతిచోటా ఈ ఉద్యమానికి అద్భుతమైన స్పందన వచ్చింది. అందరూ కొన్ని రోజులలోనో లేక వారాలలోనో స్వాతంత్ర్యం రావడం తథ్యమనుకున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఉత్తరప్రదేశ్‌లోని చౌరీచౌరా అనే చిన్న గ్రామంలో కొంతమంది గ్రామస్థులు పోలీసుల దౌర్జన్యాన్ని సహించలేక తిరగబడ్డారు. వారు స్థానిక పోలీస్‌స్టేషన్ మీద దాడిచేసి దాన్ని తగులబెట్టారు. ఇంత పెద్ద దేశంలో కేవలం ఒక్క గ్రామంలోనే ఈ సంఘటన జరిగింది. వాళ్ళు హింసను ప్రతిహింస ద్వారా ప్రతిఘటించారు. ఈ సంఘటనకు నేపథ్యం చాలా పరిమితమైనది. గాంధీజీ మొత్తం ఉద్యమాన్నే నిలిపివేయడానికి ఈ చిన్న సంఘటనే కారణమైంది. "స్వాతంత్ర్యానికి మీరు ఇంకా సిద్ధం కాలేదు" అని గాంధీ అన్నారు. కాంగ్రెస్‌పార్టీతో సహా మిగతా రాజకీయపార్టీలన్నీ కూడా గాంధీజీని విమర్శించాయి. అంతటి ఉధృతమైన ఉద్యమాన్ని, భావోద్వేగాన్ని మళ్ళీ తీసుకురావడం చాలా కష్టం కాబట్టి, సహాయ నిరాకరణోద్యమాన్ని ఆపివేయడం మహాత్మాగాంధీ చేసిన రాజకీయ తప్పిదమని అన్నారు. సహాయ నిరాకరణోద్యమం పతాకస్థాయిలో ఉన్నప్పుడు దానిని ఆపడం తప్పు అన్నారు. "హిమాలయమంత తప్పిదం" (హిమాలయన్ బ్లండర్) – ఇదీ వాళ్ళు వాడిన పదం. మొత్తం కాంగ్రెస్‌పార్టీ, జాతీయనాయకులు అందరూ దానిని వ్యతిరేకించారు. ప్రజలను కూడా ఉద్యమాన్ని ఆపవద్దని అన్నారు. కానీ గాంధీజీ ఒక్కరే ఉద్యమాన్ని ఆపేయమన్నారు. ప్రజలు గాంధీ మాటను అనుసరించి ఉద్యమాన్ని ఆపివేసారు. ఆ ఉద్యమం ఇంకో వారం పాటు కొనసాగివుంటే స్వాతంత్ర్యం అప్పుడే వచ్చి ఉండేదేమో, ఎవరికి తెలుసు? కానీ గాంధీజీ ఈ ఒక్క విషయాన్ని మన్నించి, రాజీపడి ఉంటే ఇలాంటి హింసాత్మక సంఘటనలు మరెన్నో జరిగేవి. ఎవరైనా ఒకసారి రాజీపడి ఉన్నతమైన మార్గం నుండి ప్రక్కకు పోతే అదే బాటలో ఇతర విషయాలలోనూ రాజీపడటం మొదలుపెడతారు. ప్రారంభంలో అది చిన్నదిగానే ఉంటుంది, కానీ క్రమంగా అందరూ అదే దారిలోకి వెళ్ళిపోతారు.

ఆ తరువాత క్విట్ ఇండియా ఉద్యమం రావడానికి దాదాపు 25 సంవత్సరాల సమయం పట్టింది.



కేవలం ఒకే ఒక్క సంఘటన మూలంగా స్వాతంత్ర్యోద్యమం దాదాపు 25 సంవత్సరాల వెనుకకు వెళ్ళిపోయింది. **అదీ సరైన స్వచ్ఛమైన మార్గాన్ని అంటిపెట్టుకోవడం అంటే, రాజీపడకుండా, అకుంఠిత దీక్షతో, పట్టుదలతో ఉత్తమమైన మార్గాన్ని అంటిపెట్టుకోవడం, ఇదీ నాకు ఇష్టమైనది.**

*– శరశ్చంద్రికలు 5వ భాగం*

## సద్గురు సమ్మోహనం - సాయినామ జగన్మోహనం

1998 సెప్టెంబర్‌లో నేను మద్రాసులో ఉన్నాను. నా శ్రీమతి నెల్లూరులో ఉంది. నెల్లూరు నుంచి ఫోన్ చేసింది. నెల్లూరులో సత్సంగానికి హాజరు అయినాము. వాళ్ళు చెప్పారు, ఎవరో “సాయినాథుని శరత్‌బాబు” అనే ఒక కొత్త గురువు. కొత్త స్వామి వచ్చినాడంట, ఆయన చాలా మహత్యం గల్లోడు, మనం అక్కడికి పోదాము అని నా భార్య నాకు ఫోన్ చేసింది. నేను ఆ ఫోన్ తీసుకొని నవ్వి, ఇప్పుడుండే స్వాములు చాలక మళ్ళీ ఆయనెందుకు ‘స్వామి’ అని ఎగతాళిగా మాట్లాడాను. కాదు... కాదు... ఆయన చాలా పవర్‌ఫుల్ పర్సన్ అంట, ఆయనకి చాలా మహత్యం ఉందంట, పోవాలని అనుకుంటున్నాం ఖచ్చితంగా అంది. అప్పుడు నేను, “సరే, మీరు పోవాలనుకుంటే పోండి” అని ఊరకున్నాను. నేను 1988లోనే షిరిడీకి వచ్చున్నాను ఒక తడవ. పది సంవత్సరాల క్రితం. అప్పుడు ఒక సినిమా వ్యవహారం. సినిమా రిలీజ్ చేసి అక్కడ మ్రొక్కుకున్నాము సాయిబాబా దగ్గరకి పోయివస్తామని. సినిమా రిలీజ్ చేస్తే, ఆ సినిమా మొదటిరోజు కలెక్షన్ రూ॥ 1500/– రావాల్సి ఉంటే రూ॥ 500/–లే వచ్చింది. ఇది వారం రోజులు కూడా ఆడేటట్టులేదు అని చెప్పారు. మేము షిరిడీకి పోతున్నాము స్వామీ, మళ్ళీ సోమవారం వస్తాము అంటే. సోమవారంలోపు తీసేయాల్సి వస్తుందేమో అని థియేటర్‌వాడు చెప్పాడు. ఏం చెప్పినా మనమేం చేస్తాం. టిక్కెట్ బుక్ చేసుకున్నాం. ప్రొడ్యూసర్, నేను అందరం షిరిడీకి వచ్చాం. షిరిడీలో ఉండి సోమవారం పోయినాము హైదరాబాద్‌కు. సినిమా తీసేసుందా, ఉందా అని అడగటానికి కూడా భయపడ్డా. నేను ఫోన్ చేసి అడిగితే థియేటర్ వాడు సార్, ఈ రోజు హౌస్‌ఫుల్ అయింది అన్నాడు. అది సాయిబాబా మహత్యం అనుకొన్నాం. 70 రోజులు ఆడింది. పదిలక్షల రూపాయలు కలెక్ట్ చేసింది. అంతా బాగా జరిగిపోయింది. ఇది సాయిబాబా మహత్యం వల్ల జరిగిందిలే, అతను చెప్పిన మాటలకు పొంతనలేకుండా, బాగా జరిగిపోయిందిలే అనుకున్నాం. “మంచిరోజు” అనే సినిమా అది. అందువల్ల సాయిబాబా మీద గురుత్వం ఉంది. ఇక ఈ కొత్తస్వామి ఉన్నాడే ‘శరత్‌బాబుగారు’ ఆయన గురించిన ఆలోచన నాకు.



మామూలుగా ఈ స్వాములంతా దొంగస్వాములు, డబ్బుస్వాములు అని రెండు రకాలుంటారు. దొంగస్వాములు, కొందరు Purely డబ్బు Business చేసుకునేదానికి స్వామిత్వాన్ని ఏర్పాటు చేసుకొని Business చేస్తుంటారు. అది అందుకనే వేమన ఒక పద్యంలో చెప్పాడు. మూడు రకాల గురువులు అని చెప్పాడు. కల్ల గురువులు – కల్ల గురువులు ఏదైనా మీ కర్మ అని చెప్తారు. చెప్పేసి ఏదైనా డబ్బుకొట్టేసి ఏదన్నా ఇట్లా జరిగింది, అట్ట జరిగింది అంటారు ఇక. మధ్య గురువు – ఈ మంత్రం చెప్పు, ఆ మంత్రం చెప్పు, నీకంతా బాధలుపోతాయి అని చెప్తాడు. ఉత్తమ గురువు అనే మూడవ గురువు – మనకు 'యోగసామ్రాజ్యాన్ని' ఇస్తాడు. యోగసామ్రాజ్యం అంటే మనకు తెలియదు కదా! నేను గురువుగారిని అడిగా అరుణాచలంలో ఒక రోజు సత్సంగంలో. ఈ పద్యంలో ఇట్లా చెప్తున్నారు స్వామీ, మేము మిమ్మల్ని ఉత్తమ గురువుగా భావిస్తున్నాము. మీరు మాకు యోగసామ్రాజ్యాన్ని ఇస్తున్నారు. యోగసామ్రాజ్యం అంటే ఏమిటో చెప్పండి మాకు అని. గురువుగారు 17 ని॥ల సేపు సమాధానం చేసి అన్ని విషయాలు చెప్పారు. అది రికార్డెడ్. సాయిపథంలో ఉంది. మీరు అక్కడ వినాల్సిందే. నేను చెప్పలేను ఆయన చెప్పింది. ఆయన అంత స్పష్టంగా, అంత వివరంగా చెప్పారు అన్నమాట. ఇక్కడ నెల్లూరులో ఇది చెబితే, కల్ల గురువులు జాస్తిగా ఉన్నారు ఈ కాలంలో, అని నేను గమనిస్తున్నాను. సరే, షిరిడీకి పోదాం అంది నా శ్రీమతి. షిరిడీకి పోవాలన్నా, గురువుగారిని చూడాలన్నా డబ్బులు కావాల ఒక పదివేల రూపాయలు అన్నా ఎత్తకొని పోవాలి ఖర్చులకైనా, దేనికైనా. మన దగ్గర డబ్బులులేవు. అప్పుల్లో ఉన్నాం ఇప్పుడు. నేను భరించను, ఎట్లా చేస్తాం అని నేను ఎట్లా అయినా ఎగరగొట్టేయాలని ప్రయత్నం చేశా. ఈయన కల్ల గురువు కాదు, పోవాల్సిందే అంది. అట్లా అయితే ఒక షరతుపెట్టా. నాకు ఒకరు డబ్బులియ్యాలి. మేము అప్పుల్లో ఉన్నాము. మేము ఎవరికో ఇచ్చున్నాం. వాడు ఇవ్వలేదు. వాడు పది సంవత్సరాల నుండి డబ్బు ఇవ్వలేదు. వాడు ఇస్తాడని నమ్మకం కూడా లేదు. వాడు కానీ డబ్బులు తెచ్చిస్తే షిరిడీకి పోదాం, రైలు టికెట్లు కూడా దొరికితే అని చెప్పా. అదీ షరతు. స్టేషన్‌కి పోయి అడిగితే రైలు టిక్కెట్స్ అయిపోయాయని చెప్పాడు. ఆ ప్రయాణం వాయిదా పడింది. ఇక వాడు డబ్బులు తెచ్చిచ్చేది లేదు, మనం పోయేదిలేదు అని అనుకున్నా. అనుకున్న తర్వాత రెండు రోజుల్లో ప్రయాణం ఉంది అనగా వాడు పదివేల రూపాయలు తెచ్చిచ్చాడు. ఇది సాయిబాబా మహత్యమే కదా అని అనుకున్నాం. వీడు ఏదో పదివేల రూపాయలు తెచ్చిచ్చాడు కదా, పదివేల రూపాయలు తీసుకున్నాం. అప్పుడు మళ్ళా స్టేషన్‌కి పోయినాం. స్టేషన్‌కి పోతే టిక్కెట్లు కోసం



అప్పుడు వాడు అయ్యా నెల్లూరు నుండి అయితే లేవు, గూడూరు నుండి అయితే ఉన్నాయి ఇస్తా అన్నాడు. ఇయ్యవయ్యా ఏదో ఒకటి అని మేము నలుగురం ట్రైన్ ఎక్కి షిరిడీకి వచ్చేశాం. నేనే Escort గా వచ్చా. నాకు "గురువుగారు" అని నమ్మకం ఏమీలేదు. ఏదీ ఆ పదివేలు ఆయనకి సమర్పించి వచ్చేస్తారు. డబ్బుకు Escortగా వచ్చా నేను. అంతేకానీ గురువుగారికి నమస్కారం చేసుకుందామని రాలేదు. వీళ్ళని Protect చేయటానికి... వీళ్ళని కూడా కాదు. ఆ డబ్బుని Protect చేయటానికి వచ్చినట్లు.

గురువుగారి దగ్గరకు వచ్చాం. మేము వచ్చాక మూడురోజులు ఆయన దర్శనం ఇవ్వలేదు. దర్శనం లేదు. నేను చూస్తున్నా. నేను అక్కడ CID Work చేస్తున్నా ఏంటి, ఈ గురువుగారు డబ్బులు కొట్టేసేవాడా, లేకపోతే అదా... ఇదా... గురుబంధువులంటున్నారు... గురుబంధువులందరూ భలే సిన్సియర్‌గా కనబడుతున్నారు. అక్కడ వ్యవహారమంతా చూస్తే Different గా ఉంది. గురువుగారు ఇంట్లోనే ఉన్నారు. ఇప్పుడుండే సాయిపథం ఉన్న ఇంట్లోనే ఉన్నారు. ఒకరోజు నేను గురువుగారు ఉన్న ఇంటి అవతల ప్రక్కకుపోయి ఒంటేలుపోశా. ఒక గురుబంధువు వచ్చి, ఏంటిపెద్దాయన, గురువుగారు ఆ రూములోనే ఉంటే నువ్వు ఇక్కడ ఒంటేలు పోస్తున్నావు అని కూడా అన్నాడు. భలే సిన్సియర్‌గా ఉన్నారే అని అనుకున్నాను. అంతేకానీ, ఆ గురువుగారిని చూస్తామని కానీ, నాకు ఏమీ నమ్మకాలు లేవు. అందువల్ల ఇవన్నీ నాటకాలు ఆడాలి కదా! అనుకున్నా. మూడవరోజు దర్శనము అన్నారు. (అప్పుడు గురువుగారి దర్శనాన్ని వివరిస్తూ) మూడవరోజున ఆయన రూములోంచి ఇప్పుడున్న కట్టిన సత్సంగహాలు అప్పుడులేదు, ఇప్పుడున్న రౌండ్ కుటీరం వేసున్నారే అక్కడ ఏర్పాటు చేశారు. ఆయన కూర్చొనేదానికి. అక్కడే ఉన్న ఆయన రూములోంచి బయల్దేరారు పదకొండు గంటలకి సరిగ్గా. హాలు మీదుగా రౌండ్ హాలునకు అటు తిరిగి వచ్చేటప్పటికి గంట పట్టింది. అంటే అందరూ వరుసగా నిలుచోని పూలమాలలు వేస్తున్నారు. అందరి చేత అడిగి చెప్పించుకుంటూ వస్తున్నారు. నేను ఆ స్టేజీ ముందరకుపోయి కూర్చున్నా. స్వామిని ఎట్లాగయినా చూడాలి కదా అని, చూడకుండా ఎందుకుండాలి? ఏదో చూస్తాములే దొంగస్వామిని... గడ్డం, మీసం, కాషాయం ఇవన్నీ ఉంటాయి. ఇవన్నీ ఊహించి చూద్దాములే కళ్ళు తెరచి అని కళ్ళు మూసుకునే ఉన్నా. ఈ మధ్యలో నా శ్రీమతి వచ్చి, 'అందరూ నమస్కారం పెట్టుకుంటున్నారు. నువ్వు కూడా వచ్చి నమస్కారం పెట్టుకోవయ్యా' అని అన్నది. నేను రాను, నేను నమస్కారం పెట్టుకోను, మీరు కావాలంటే నమస్కారం పెట్టుకోండి అని చెప్పేశాను. వాళ్ళు పెట్టుకున్నారనుకుంటా. నేను వచ్చేసి, కింద కూర్చొని కళ్ళు



మూసుకొనే ఉన్నా. ఇంతసేపు ఏంది, వీళ్ళు ఇంత మూర్ఖులుగా ఉన్నట్టున్నారే. ఇంతసేపు నమస్కారం పెడుతున్నారు అని నేను మనసులో అనుకుంటున్నా. అబ్బ! ఎంత మూర్ఖులండీ ప్రజలు, ఒక గంట పట్టిందే, 40, 50 గజాల దూరం నడిచేదానికి అని అనుకుంటున్నా. నా మనసులో ఉండేది చెప్పొద్దు నేను. నా మనసులో అనుకుంటున్నా. ఇలా ఆలోచిస్తున్నా. సరే... గడ్డం, మీసం ఉంటదే అని చూస్తూ ఉన్నా. ఎట్టాగయినా చూడాలి కదా! నేను స్టేజీకి పది అడుగుల దూరంలో కూర్చున్నా, స్వామిని చూద్దాంలే అని. ఇదంతా అయిపోయి సరిగ్గా గంటకి వచ్చినారు. సరిగ్గా పన్నెండు గంటలకి వచ్చి కూర్చోగానే వీళ్ళంతా చప్పట్లుకొట్టారు. అంటే స్వామి వచ్చారు కదా అని అర్థమయింది. అప్పుడు కళ్ళెత్తి చూడాలి కదా! చూడకుండా ఉంటే ఎట్లా. అప్పుడు కూడా చూడకుండా ఉంటే ఎట్లా! మనిషినన్నా చూడాలి కదా! అనుకొని, కళ్ళెత్తి చూసేసరికి సడన్‌గా గడ్డంలేదు, మీసంలేదు, కాషాయంలేదు, తెల్లగుడ్డలు వేసుకొని మంచి రూపంగా ఉన్నారు. మంచి రూపం కదా! ఏందీ ఈయన ఇట్టున్నాడు అని అనుకున్నా. నాకు భయం ఏముంది అప్పుడు. ఏమీ తెలియని వాడికి ఏమీ భయం లేదు. తెలిసిన వాడికే గానీ భయం. తెలీనోడికి ఏముంది భయం. భయం లేదు. ఏందీ... ఈ స్వామి ఇట్టున్నాడు అని నేను పైకి ఓపెన్‌గా అన్నా, మనకేం భయం అంటే, ఆ ప్రక్కనుండే గురుబంధువులు అదేం కాదయ్యా, ఈయన Married Person with a Child అని చెప్పారు. నేను ఇప్పుడింకా Stun అయిపోయాను.

***(మిగతా తరువాయి సంచికలో)*** ***– నామం 'జగన్మోహన్ రెడ్డి' గారితో ఆడియో సంభాషణ***

**నిత్యము లేదా అప్పుడప్పుడు చేసే గురుపూజల ద్వారా – సత్సంగం ద్వారా వారి గురువాక్కుల ద్వారా మనలో ఒక అద్భుతమైనటువంటి ధైర్యం, స్థైర్యం కలుగుతుంటుంది. కాబట్టి ఎప్పుడూ గురుపాదాలను పట్టుకుని ఉండే వ్యక్తుల సకల వ్యవస్థలు అవస్థల పాలవ్వకుండా, గురువు ఏర్పాట్లు చేస్తారు అనే సత్యాన్ని మన జీవితానుభవాలలో చవిచూసాం. అట్టి 'గురుకృప' మనకు ఎల్లవేళలా ఉంటుంది అన్న సత్యాన్ని మరువరాదు.**

**తన జన్మదినోత్సవంతో (జన్మదిన సంచిక) నూతన వత్సర శుభ – ఆకాంక్షలను తెస్తుంది, ఇస్తుంది మన అందరికి 'గురుకృప'.** **– గురుకృప**




# నైవేద్యం

ఇది బాబా ప్రధానంగా గుర్తుపెట్టుకోమని చెప్పినటువంటి ఒక విషయం. ఆయన ఏమన్నారంటే, "ఎవరైతే నాకు పెట్టకుండా ఏమీ తినరో, వాళ్ళకు నేను బానిసను. వాళ్ళను రక్షించడానికి నా తలనైనా ఇస్తా" అని అన్నారు. దాన్ని మాత్రం ఆయన చాలా ఎక్కువ స్ట్రెస్ (Stress) చేసి మరీ చెప్పేవారు; ఆ నైవేద్యమనేటువంటి దాన్ని గురించి. ఎందుకని? మన ఆలోచనల్లో ఎక్కువ వీక్‌నెస్‌గా ఉండేటువంటి మనసుకు బలహీనత ఏమిటనంటే తిండి గురించే. ఎందుకని? మనలను నిలబెట్టేటువంటిది ఆహారం కనుక; ఆహారానికి సంబంధించినటువంటి ఆలోచనలు మనకు ఎక్కువ వస్తూ ఉంటాయి. ఇది తింటే బాగుండును. అది తింటే బాగుండును అని. అందుకనే **వేమన** అన్నారు – **"జిహ్వా రుచుల చేత జీవుండు చెడునయా"** అని! మనం మామూలుగా చాలా తేలిక అనుకుంటాం జిహ్వను జయించడం. కానీ ఆలోచిస్తే మాత్రం అంత తేలికకాదది. ఏమి తింటున్నాసరే. మనం మంచినీళ్ళు త్రాగుతున్నా, ఏమి తింటున్నా సరే. ఒక్కసారి ఇది బాబాకు నైవేద్యం పెడుతున్నాం. ఇది ఆయన యొక్క ప్రసాదం. ఇది ఆయన యొక్క ఉచ్ఛిష్టం, ఆయన యొక్క నైవేద్యం అనుకొని తినేసెయ్యడం. మనం తినే ప్రతి ఒక్కటి కూడానూ ఆయన నైవేద్యమే అవుతుంది. మనం ఏమి తింటున్నా సరే, అది ఆయనకు పెట్టడమే. అన్ని జీవుల్లోనూ ఉండి తినేటువంటిది ఆయనే. మంచినీళ్ళు త్రాగుతున్నా సరే. ఒక్కసారి మనసులో దానికి పెద్ద పోజు ఇవ్వాల్సిన అవసరం లేదు. మంచినీళ్ళు అక్కడ గ్లాసులో పెట్టుకొని, ఒక్కసారి కళ్ళుమూసుకొని, దానికి నిటారుగా కూర్చొని, ఏదో మంత్రం చదివి, **"అమృతమస్తు అమృతోపస్మరణమితి స్వాహా"** అని అనుకొని... దానికి ఇవన్నీ చెయ్యాల్సిన అవసరం లేదు. గ్లాసు చేతికి తీసుకుంటుండగానే మన మనసులో ఒక భావన వచ్చేస్తుంది; ఇది బాబా తీర్థం. ఇది బాబా యొక్క పాదతీర్థం అని. గ్లాసు ఇక్కడి నుంచి నోటికొచ్చేటప్పటికి ఈ భావన అయిపోతుంది. చూసేటటువంటి వాడికి ఏమీ అర్థంకాదు. మనం అసలు నైవేద్యం పెట్టామన్న విషయం కూడా అర్థం కాకూడదు. భోంచేస్తున్నాము, నీళ్ళు తీసుకుని వచ్చి ఇట్లా పోసి, ఇట్లా త్రిప్పి... ఈ తంతంతా చెయ్యాల్సిన అవసరమేమీ లేదు. తంతే మిగులుతుంది మనకు. మనసులో ఆ భావం... "ఇది బాబా ప్రసాదం. బాబా పెడితే నేను తినాలి. అందరికీ అన్నీ ఇచ్చేవాణ్ణి నేనే అన్నారాయన. ఈ రోజున ఈ రూపంలో నాకు అన్నం పెట్టారాయన; ఇది ఆయన ప్రసాదం; ఆయన యొక్క ఉచ్ఛిష్టం; ఆయన తినగా మిగిలినటువంటి ఉచ్ఛిష్టం" అనే భావంతో తింటాం. భావం ఎక్కడైతే ఉందో అక్కడ ఫలితమూ ఉంటుంది. రోజూ మన ఇంటికి బాబాను పిలిచి, ఆయనకు సేవచేసి, ఆయనకు భిక్ష పెట్టినటువంటి పుణ్యం మనకు వస్తుంది. ఆయనతో ఋణానుబంధం పెరుగుతుంది. రోజూ ఆయన మన ఇంటికి వచ్చి భిక్ష చేస్తుంటే మనకు ఎంత ఋణానుబంధం పెరుగుతుంది? బాయాజాబాయి ఇంటికి ఆయన



రోజూ భిక్షకు వచ్చేవారు. ఆయన ఎట్లా చూసుకున్నారు ఆమెను గాని, తాత్యాకోతేనుగానీ? ఎప్పుడో రెండు రొట్టెలు పెట్టినటువంటి దానికి ఆయన రోజూ ముప్పైఐదు రూపాయలు ఇచ్చారు తరువాత ఆ రోజుల్లో. లక్షాధికారులూ, కోటీశ్వరులూ అయినారు. ఎందుకని? బాబాకు ఒక ప్రిన్సిపుల్ ఉంది. **"నాకెవరైనా సరే ఒక రూపాయి ఇస్తే, నేను తిరిగి వాడికి పది రూపాయలు ఇవ్వాలి"** అని. ఆయన చేసిన ప్రతిజ్ఞ అది. ఇక మనం రోజూ భిక్షగానీ పెట్టినట్టైతే అంతకు పదింతలు మనకు దేనికీ లోటు ఉండకుండా ఆయన జరుపుకుంటారు. ఈ నైవేద్యం సరిగ్గా పెట్టినట్లు ఎట్లా లెక్కంటే; మనం మామూలుగా ఆలయాల్లో చూస్తూ ఉంటాం; ముందు ఎవరో ఒక పూజారి తయారు చేస్తాడు అన్నం. ఆ బాలభోగమో, లేకపోతే మహానైవేద్యమో ఏదో ఒకటి. దానికి పెద్ద మూత ఒకటి వేస్తారు. అది తీసుకొచ్చి విగ్రహం ముందు పెడతారు; కర్టెన్ ఒకటి వేస్తారు. నైవేద్యం పెట్టిన తరువాత తీస్తారు. అసలు ఏంటి ఈ రోజు ప్రసాదం అనేటువంటిది, అప్పటిదాకా సస్పెన్స్‌లో ఉంటుంది. ఎవరికీ అర్థంకాదు. ఎవరూ చూడకూడదు; ఎవరి దృష్టీ దాని మీద పడకూడదు. అది అర్థరహితంగా పెట్టిన ఆచారం కాదు. ఎందుకనంటే శాస్త్రం ఏమి చెప్తుందంటే, మహాత్ములు ఏం చెప్పారంటే... మనం ఒక పదార్థాన్ని చూసినప్పుడు ఆ పదార్థం యొక్క రుచిని మనం ఊహిస్తాం. చూడనక్కరలేదు; విన్నా చాలు. ఊరగాయ అనే పేరు చెప్పామనుకోండి. లేకపోతే ఫలానా పచ్చడి అనే పేరు చెప్పామనుకోండి; వెంటనే ఆ పచ్చడి యొక్క రుచిని మనసు ఊహించి, నోట్లో నీళ్ళూరుతాయి తలచుకుంటేనే. మనం నైవేద్యం పెట్టేది ఏమిటనంటే మనం రుచిని ఊహిస్తామే, రుచిని గురించి మనసులో ఊహ వస్తుందే, ఈ ఊహాభాగమే భగవంతుడు తీసుకునేది. **మనం ఏ పదార్థాన్ని చూసినాసరే, ముందు ఆ రుచిని ఊహించకుండా ఉండగలగాలి. అప్పుడే నైవేద్యం సరిగ్గా పెట్టడం వీలుపడుతుంది మనకు.** సాధన చేసి మనసుమీద అద్భుతమైనటువంటి అదుపు ఉండేటటువంటి వాళ్ళుగా పూజారులుగా ఉండాలి; కనుక, అటువంటివాళ్ళకి ఆ భావం కలగదు కనుక వాళ్ళు మాత్రమే పెట్టి ఆ తరువాత ప్రసాదంగా అందరికీ పంచడం అనేటువంటి ఆచారం మనకొచ్చింది ఆలయాల్లో. మనం కూడా కానీ రోజూ "ఇది బాబా ప్రసాదం; ఇది బాబా తినాలి; మనం ముందుగానే రుచిని ఊహించకూడదు" అనే భావంతో మనం ప్రతి పదార్థాన్నిగానీ చూసినట్టైతే ముందు మన జిహ్వా మీద మనకు కంట్రోల్ వస్తుంది. రెండు... మనం పెట్టింది నిజంగా అప్పుడు బాబాకు అందుతుంది. ఇట్లా చేసుకుంటూ, చేసుకుంటూ, చేసుకుంటూ పోగా నిజంగా బాబాకు అందడం అనేటటువంటిది మనకు అభ్యాసమవుతుంది. మనకు అభ్యాసమైందా లేదా అని చూసుకునేదానికి గీటురాయి ఇదే! ఏ పదార్థాన్ని



తలచుకొన్నా, ఏ పదార్థాన్ని గురించి విన్నా, ఏ పదార్థాన్ని చూసినా సరే, ఒక రాయిని చూసినట్లో, రప్పను చూసినట్లో ఉండాలి. రాయిని చూస్తే రాయి రుచిని ఊహిస్తామా మన మనసులో? ఈ లోపల అసలు దాని రుచి మీదకే పోకూడదు. ఆ ఆలోచనే రాకూడదు. అప్పుడు బాబా దగ్గరకి తీసుకెళ్ళి నైవేద్యం పెడితే, ఆ తరువాత దాని రుచి మన మనసుకు రావాలి. పోగా పోగా ఎట్లా వస్తుందనంటే, ఇదిగానీ అభ్యాసం చేస్తూ చేస్తూ చేస్తూపోగా భగవంతుడికి నైవేద్యం పెట్టినటువంటి పదార్థాన్ని చూస్తేనే మనకు దాని రుచి జ్ఞాపకం వస్తుంది. కొంతకాలం పోయిన తరువాత రుచి జ్ఞాపకం వచ్చిందనంటే; ఇది నైవేద్యం పెట్టిన పదార్థమేనే అని అనిపించాలి. ఇక రుచి మనకు జ్ఞాపకం రాగానే ఎంగిలి అయిపోయింది. ఇంక ఆయనకు నైవేద్యం పెట్టాల్సిన అవసరం లేదు. భౌతికంగా మనం రుచి చూడాల్సిన అవసరం లేదు. మానసికంగా ప్రతి పదార్థాన్ని రుచి చూసేస్తున్నాం మనం. ఆ రకంగా ప్రతి పదార్థాన్ని ఎంగిలి చేస్తున్నాం. దాన్ని బాబాకు పెట్టడం ఎంతవరకు సముచితం? కాబట్టి ముందు అది కూడా పోవాలి. దాని యొక్క రుచిని మనసు ఊహించకుండా ఉండేటటువంటి స్థితి మనకు రావాలి. దీనికి ఇందాక నేను చెప్పినటువంటిది ఏది తిన్నా, ఏది చూసినా సరే, ఇది బాబా యొక్క ప్రసాదం అని మనసులో అనుకోవడంతో మనం తిన్న ప్రతి ఒక్కటీ బాబా ప్రసాదమే అవుతుంది. బాబాకు రోజూ మనం భిక్ష పెట్టినటువంటి ఫలితం వస్తుంది. బాబా ప్రసాదం మనలోకి పోయినందువల్ల మనలో ఉండేటటువంటి ఆలోచనలన్నీ కూడానూ మంచి ఆలోచనలు, బాబాకు సంబంధించిన ఆలోచనలే వస్తాయి. ఎందుకని? మనకు ఆలోచనలు తెచ్చేటువంటిది ఏమిటనంటే, ఆలోచనలు ఇచ్చేటువంటిది ఏమిటనంటే ఆహారమే!

ఆహారం సరిగ్గా ఉంటే ఆలోచనలు సరిగ్గా ఉంటాయి. కాబట్టి బాబా ప్రసాదమే తింటున్నట్లయితే పవిత్రమైనటువంటి ఆలోచనలు మనలో రావడం మొదలవుతాయి. బాబాకు సంబంధించిన ఆలోచనలే వస్తాయి. మనలో ఉండేటువంటి బలహీనతలన్నీ కూడానూ మాసిపోతాయి. ఇట్లా మనం చేసేటటువంటి ప్రతి పనీ కూడానూ బాబా యొక్క సేవ క్రిందనే మనం మలుచుకోవడంలో ఉంటుంది. అప్పుడు సాధనలోనే జీవితం భాగం అవుతుంది. ఇంక మనం దేన్ని గురించి ఆలోచించాల్సిన పనుండదు. మనలను గురించి ఆయన ఆలోచిస్తుంటారు. మనకు కష్టం వచ్చే ప్రశ్నే లేదిక. ఈ రకంగా నేను చెప్పిన ప్రకారంగా ఎవరైతే చేస్తారో వాళ్ళకు కష్టం, లోటు అనేటువంటిది ఉంది అనే క్వొశ్చనే లేదసలు. అన్నీ ఇంక ఆయనే చూసుకుంటారు. ఆయనకు అన్నింటికంటే మనం అత్యంత ప్రీతిపాత్రులమవుతాం.

– శ్రీబాబూజీ

# గురుకృపాలహరి



మానవజాతి హితం కోసం భగవంతుడు సగుణ స్వరూపంగాను, నిర్గుణ స్వరూపంగాను అవతరిస్తూనే ఉన్నాడు. ఆయా వ్యక్తుల సంస్కారాలననుసరించి ఏ రూపంలోనైనా తనను అంతరంగంలో నిలుపుకొని తమను తాము సంస్కరించుకుని తన స్వస్వరూపమైన 'ఆనంద'స్వరూపాన్ని అవగతం చేసుకునే వరకు మనతో, మనలో ఒకరిగా ప్రభవిస్తూనే ఉన్నాడు, ఉంటాడు. ఈ ప్రయత్నంలో కూడా కొందరు సగుణ, నిర్గుణాలవాదంలో మునిగి దుఃఖతావులనెంచుకుంటారు. అగ్నిని, దాని దాహకత్వాన్ని రెంటినీ విడదీయడం సంభవమేనా? అగ్నికి పేరున్నా, పేరు లేకపోయినా, 'దహించడం' దాని నైజం. రూపంతో ఉన్నా, రూపంతో లేకపోయినా 'దహించడం' తథ్యం. సగుణ స్వరూపుడైన సద్గురుమూర్తి సాన్నిధ్యాన్ని అనుభవించేకొద్దీ మనలోని అవగుణాలు అంతరించి, 'అడ్డుగోడలు' కూలి, అవని మొత్తం నిండిన ఆ విశ్వరూపం, నిర్గుణస్వరూపం–మనకోసంగా, కరుణతో వేంచేసిందని అర్థమవుతుంది. ఆయా వ్యక్తుల ప్రేమ పిపాస వారికి ఒక్క జన్మలోనే ఆ స్వరూపం అర్థమయ్యేటట్లు చేయవచ్చు, లేదా బిడ్డలు చివరివరకు గమ్యం చేరేదాకా ఎన్నో రూపాలు ధరించాల్సిన అవసరం ఏర్పడవచ్చు. ఇది బిడ్డల కోసం గురువు చేసే శ్రమ. ఇందులో ఏ మీమాంసకు తావులేదన్నది చరిత్ర చెప్పే లీలా మధురిమ. దేవుడంటే ఏ నమ్మకమూ లేని, విగ్రహారాధనను నిరసించి, ఫక్తు భౌతికవాదిగా జీవించిన ఆర్థర్ కోస్టవెర్ పరమాచార్యస్వామి వారిని దర్శించాడు. తన భావాలే సరియైనవన్న ఒక విపరీత విశ్వాసం కలిగిన వాడు కోస్టవెర్. ఎన్నో దేశాలచే నిషేధింపబడ్డ The Lotus and the Robot రచయిత.

దేవుని ఉనికినే ప్రశ్నార్థకమన్న కోస్టవెర్ అంటాడు "భగవంతుడున్నాడనేట్లయితే ఇక్కడే ఆయన ఉన్నాడు" అని. అంతేకాదు, స్వామివారి చిరునవ్వును "యేసుక్రీస్తు ఎప్పుడైనా మందహాసం చేసి ఉంటే అది ఈ హిందూస్వామి చేసిన దానివలే ఉంటుంది" అని వర్ణించాడు. భగవద్ ఉనికికే 'ప్రశ్న'ను జతచేసిన భౌతికవాదులు కూడా ఎక్కడో తెలియని శాంతిని పొందారంటే 'దైవం' సగుణమా? నిర్గుణమా? దైవం సగుణరూపంలో అవనికి వేంచేసిన ప్రతీసారీ మానవులందరూ మహోత్సవంగా చేసుకోవాలా? వద్దా? ఆ సగుణ స్వరూపాలను కన్నులారా దర్శించి, వారి అనుగ్రహభాషణాలను తనివితీరా ఆస్వాదించి ఆచరణలుగా మార్చుకోవాలా? లేదా? ఇది మనలో, మనకై రావాల్సిన పరిణామం – మేఘుడు జలాలను మనమున్న చోటుదాకా తీసుకువస్తాడు. చెరువులుగా, కాల్వలుగా, ఇంకుడు గుంతలుగా ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనదే. గురుచంద్రులు



తమ అనుగ్రహ మేఘాలను మనదాకా తీసుకొని రావడంలో అహరహము శ్రమిస్తూనే ఉన్నారు. ప్రేమ, భక్తులతో జత చేసుకుంటే మనపై కురిసి, మన జీవితాల్లో ఆనందంగా విరిసేందుకు ఎదురుచూస్తూనే ఉన్నారు గురుచంద్రులు. మేఘానికేది రూపం? అనంత ప్రేమది ఏ స్వరూపం? అందుకే అన్నారు పూజ్య శ్రీబాబూజీ "జగత్తులోని అన్ని రూపాలూ ధరించిన తత్త్వం తానే అని అనుభవపూర్వకంగా భక్తులకు తెలియచేసిన ఆ 'రూపాతీతుని' రూపం సాయిభక్తుల ధ్యానానికి ధ్యేయం. ఆనందానుభవానికి ఆలంబనం" అని, శ్రీసాయి స్వరూపాన్ని ప్రస్తుతిస్తూ. జగత్‌హితం కోసం నిరాకార స్వరూపమే అయినా కేవలకృపతో సగుణరూపం ధరించిన పరమాచార్యుల పదప్రస్థానంలోకి పయనిద్దాం... తరిద్దాం...

1936వ సం॥ ఏప్రిల్ 4వ తేదీ స్వామి వారు కటక్ జిల్లాలోని జాజ్‌పూర్‌కు పయనమయ్యారు. ప్రాచీన ఆలయాలకు, మహోన్నత శిల్ప సంపదకు జాజ్‌పూర్ పెట్టింది పేరు. ఇక్కడ వైతరణీ నది ఉత్తర వాహినిగా ప్రవహిస్తుంటుంది. ఇక్కడ పన్నెండు ఆలయాలు, ఒరియా సంస్కృతిని ప్రతిబింబించే గోపురాలు ఎంతో రమణీయంగా ఉంటాయి. వందమంది సోమయాజులు (సోమయాగం చేసేవారు) ఉండటం వలన యాజిపూర్ అనీ జాజ్‌పూర్ అనే పేర్లతో పిలవబడుతుంది ఈ ప్రాంతం. జాజ్‌పూర్ పురవాసుల ప్రేమసుమాల స్వాగతాలతో, ఉత్సాహంతో అక్కడ ఒక పండుగ వాతావరణం సంతరించుకుంది. ఐదురోజుల పాటు స్వామివారు అక్కడ విడిది చేయడము, మహాప్రదోష వేళ స్వామి వైతరణీ నదీస్నానము చేయడము జరిగాయి. అక్కడి శ్రీవిద్యాభారతి అనే పాండాకు గోదానమును, నూతన వస్త్రములను, వెండిగిన్నెను ప్రసాదించారు స్వామి.

బ్రాహ్మణి, మహానదులను దాటి కటక్ చేరుకున్నారు స్వామి ఏప్రిల్ 15వ తేదీ నాటికి. కటక్‌లోని మయూర్‌పంచ్ భవనంలో స్వామి వారి విడిది ఏర్పాటు చేయబడింది. స్వామి వారిని భక్తి విధేయతలతో కొలుచుకునే భక్తుని ఇంట్లో శంకరజయంతి మహోత్సవము, పెక్కుమందితో విద్వత్సభ జరిగాయి. ఆదిశంకరుల చిత్రపటంతోనూ, పాదుకలతోనూ, గజవాహన సమేతంగా మహానది వరకు ఊరేగింపు జరిగింది. బాణసంచా వెలుగులలో, నాదస్వర, ప్రాంతీయ నాట్యమండలి వారి నృత్యాలతో సాగిన ఆ ఊరేగింపును వేలమంది ప్రజలు దర్శిస్తూ, స్వామి వారి దర్శన భాగ్యంతో తన్మయమయ్యారు. స్వామివారు కటక్‌లో ఉండగా పూరీ గోవర్ధన మఠ కార్యనిర్వాహక వర్గము స్వామివారిని తమ మఠమునకు వేంచేయ ఆహ్వానించారు. పదిరోజుల విడిది తర్వాత స్వామి వారు ముకుందపూర్ చేరారు. అదే సమయంలో పూరీ ముక్తి మండప సభ నిర్వాహకులు స్వామివారి ఆగమనానికి అభిలషించి వినతులను సమర్పించారు.

– ***గురుకృప***

## గురువుగారితో పరిచయం నా జీవన గమనాన్నే మార్చివేసింది



శరత్‌బాబుగారిని మొదటిసారి చూడగానే ఏదో తెలియని ఇష్టం ఏర్పడింది. ఎంతసేపైనా అలా వారినే చూస్తుండిపోవాలనిపించింది. వారి మధురమైన చిరునవ్వు, చూడగానే అయస్కాంతంలా ఆకర్షించే వారి విలక్షణమైన కళ్ళు, వారి సరళమైన, స్థిరమైన ప్రవృత్తి నన్నెంతగానో ప్రభావితం చేసాయి. అనిర్వచనీయమైన ఆకర్షణ ఏదో వారివైపు పట్టి లాగుతూ నిరంతరం వారి సాంగత్యంలోనే ఉండాలనిపించేలా చేసింది.

వారి మాటతీరు, సన్నిధి అంత ఆత్మీయంగా ఉండేవి. వారి మాటలు ఎంతో మధురంగా, హాస్యభరితంగా ఉండేవి. వారు ప్రతీ విషయాన్ని కూలంకషంగా శోధించి, దానిలో పరిపూర్ణత్వాన్ని సాధిస్తారు. అపారమైన విజ్ఞానం, పాండిత్యం, ప్రతిభాపాటవాలు, ఎంత జటిలమైన విషయాన్నైనా ఎదుటివారికెంతో సులభంగా అవగాహన కలిగేలా చెప్పడం వారి ప్రత్యేకత.

క్రమంగా వారి ఔన్నత్యం తెలిసేకొద్దీ వారిపట్ల గౌరవాభిమానాలు మరింతగా పెరగసాగాయి. వారిలోని మహనీయతను గుర్తించేకొద్దీ వారి పట్ల నాకున్న అభిమానం ఆరాధనగా మారింది. నిరాడంబరత వారికి పెట్టని ఆభరణం. ఆత్మీయత వారి సహజగుణం. ఇతరులు ఏమనుకున్నా సరే వారు తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఎవరికోసం, మార్చుకునేవారు కాదు.

ఎవరెంత పెద్ద పొరపాటు చేసినా సరే మరలా అటువంటి పొరపాటు ఎన్నడూ చేయకుండా ప్రతీవారిలోను మౌలిక పరిణామం తీసుకువచ్చేవారు. ఎవరి అభిరుచులకు, సంస్కారాలకు తగినట్లుగా వారితో వ్యవహరిస్తూ, సరైన సమయంలో, సరైన సంఘటనలు కూర్చి వారిని తీర్చిదిద్దుతారు.

వారి సమక్షంలో దొరికే సంతృప్తి ప్రశాంతతలననుభవిస్తున్న కొద్దీ మన అలవాట్ల వల్ల లభించే తాత్కాలిక ఆనందం కన్నా ఎన్నో రెట్లు అధికంగా అనిపించడంతో వాటికి క్రమంగా దూరమవుతాం.

ఇది వారు మనకిస్తున్న శిక్షణ, క్రమశిక్షణ. - సాయిదీవెన (శ్రీ. ఎస్.వి.ఎల్.నారాయణరావు)

గురువు ఒక వ్యక్తి కాదని అది యొక యుగధర్మమని తెలియాలి. వేరొక మూర్తి కాదని దివ్యమగు ప్రేమావతారమని తెలియాలి. అది శిరిడీలో ఉండేదనుట ఒక తీరగుచూపు. అంతటా ఉండుననుట ఇంకో తీరగు చూపు. ఇప్పుడూ ఉన్నదనుట ఇంకో పై చూపు. ఎల్లప్పుడూ అంతటా ఉంటుంది అన్నది ఇంకో మంచి చూపు. అది దివ్యదర్శనం, సుదర్శనం. అలా గురువుని దర్శించగలగాలి. అట్టి దివ్య దృష్టిని ప్రదర్శించమని కోరాలి వారిని. ఇది కదా అడగటమంటే. అప్పుడు మనమెక్కడికి వెళ్ళినా, ఆ ధరణీసుర వర భావమే మనకు దర్శనమిస్తుంది. ఆ ఆనందస్వరూపం దర్శనమిస్తుంది. ఆ ప్రేమవాతారం గోచరిస్తుంది. ఓ చైతన్యరూపం జ్వలిస్తుంది. ఓ వ్యక్తి, ఓ రూపం, అన్న భావం వెనుకకు తిప్పుకుంటుంది. "చూపుతాకినచోట చొక్కముగ నీవే" అంటూ అంతటా, అన్నిటా సాయిని దర్శించే సుదర్శనమును గురుదేవులు మనకు అనుగ్రహించినారు. – గురుకృప

## ఆకాశంలో నక్షత్రాలెన్ని? వారి జీవిత విశేషాలు అన్ని

ఆ చరణాలను ఆశ్రయించినపుడు తెలియదు - అవే మాకు ఆలంబనలని.

ఆ రూపాన్ని చూచినపుడు అర్థం కాలేదు - దైవం యొక్క మానుషరూపమని.

వారి అనుగ్రహభాషణం వింటున్నపుడు ఊహించలేదు - ఆ మాటలు భవితకు బాటలని.

వారి లీలా వినోదాలలో ఓలలాడుతున్న మాకు అవగతం కాలేదు - అవి ఆనంద జీవన యానానికి సోపానాలని.

వారి మానవీయ విలువల ఆంతర్యం ఆలోచనకు రాలేదు - మనిషి దైవంగా ఎదగాలంటే ముందు మనిషవ్వాలని.

నేను కేవలం సాయిభక్తుడిని అని చెబుతుంటే గుర్తుకు రాలేదు - భక్తుడి చెంతనే సదా భగవంతుడు ఉంటాడని.

గుర్తొచ్చే జ్ఞాపకాలు.. గుర్తిస్తే ఆ వైపుగా అడుగులు... ఆచరిస్తే చేరగలం ఆ చరణాలు...

# సాయిపథం

